


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 91 | కర్నూలు | శుక్రవారం 25 ఏప్రిల్ 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

## ఇది పర్యాటకులపై దాడి కాదు భారత్ పై దాడి: ప్రధాని నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ,(శ్రీచక్ర) ఉగ్రవాది ఎక్కడ తల దాచుకున్న సరే వెతికి మరి శిక్షిస్తామని ప్రధానమంత్రి అన్నారు. ఉగ్రవాదులకు మద్దతిస్తున్న వారికి కలలో కూడా ఊహించని విధంగా కఠినంగా శిక్షిస్తామని అన్నారు.జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్ లోని మధుబనిలో ఏర్పాటుచేసిన కార్యక్రమం లో ప్రధాని పాల్గొన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిపై నేరుగా స్పందించారు. అమాయకులైన ప్రజలను పొట్టన పేట్టుకున్న వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు.ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉంది. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతిఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయి.ఈ ఉగ్రదాడి వెనుక ఉన్న వారు.. ఇందులో భాగమైన వారికి ఊహకందని రీతిలో శిక్ష విధిస్తాం. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది భారతీయులు విరిచేస్తారు. ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు యావత్ భారత్ దృఢ సంకల్పంతో ఉంది అమాయకులైన ప్రజలను ఉగ్రవాదులు అతికిరాత కంగా చంపేశారు. ఈ దుర్మార్గమైన దాడులకు తెగబడ్డవారు ఎక్కడున్నా తీసుకొచ్చి మట్టిలో కలిపేసే సమయం వచ్చింది. ముష్కరులు కలలో కూడా ఊహిం చని విధంగావారిని శిక్షిస్తాం. ఇది పర్యటకులపై జరిగిన దాడి కాదు.. భారత్‌పైజరిగినదాడిగా భావిస్తున్నామ న్నారు.దాడు లకు పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించు కుంటారు. అని ప్రధాని మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా భారత్‌కు అండగా నిలిచిన విదేశాలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలియ జేశారు. మాన వత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలిచారని ప్రధాని పేర్కొన్నారు. కృతజ్ఞతలు తెలిపారు.

## సచివాలయంలో సీఎం చంద్రబాబు కీలక సమావేశం..



అమరావతి(శ్రీచక్ర) : ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఎెఇఅ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కీలక సమావేశం జరుగుతోంది. పార్టనర్‌షిప్‌తో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' పై వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. ఇది రెండు రోజుల పాటు జరుగుతుంది. ఈ వర్క్ షాప్‌కు అన్ని శాఖల నుండి అధికారులు హాజరయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), సంబంధిత సాంకేతికతలను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం.. పబ్లిక్ సర్వీస్ డెలివరినీ వేగవంతం చేసేందుకు అవసరమైన అవగాహనను స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు, శాఖాధిపతులకు కల్పించే లక్ష్యంతో ఈ వర్కుషాపు నిర్వహిస్తున్నారు.ఎఐ, ఓఒ (మిషన్ లెర్నింగ్) ఇంకా పాలనకు సంబంధించి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను ఉన్నతాధికారులు అర్థం చేసుకోడం, వివిధ ప్రభుత్వ రంగాలలో ఉపయోగించే పలు రకాల ఎఐ అప్లికేషన్‌లను గుర్తించడం.. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో జనరేటివ్ ఎఐపై అంతర్ దృష్టిని సారించడం.. పాలసీ అంతర్‌దృష్టి కోసం విశ్లేషణలను ఉపయోగించి డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడం గురించి తెలుసుకోవడం తదితర అంశాలపై ఈ వర్క్ షాపు నిర్వహిస్తున్నారు.నిర్మాణాత్మక ఆలోచనలకు అనుగుణంగా ఎఐ-డ్రివెన్ గవర్నెన్స్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం ఇంకా పైలట్ ప్రాజక్టులను అమలు చేసే దిశాగా చర్యలు తీసుకోవడం.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), సంబంధిత సాంకేతికతలను సమర్థవంతంగా వినియోగించే వాద్వానీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఈ వర్కుషాపుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ఐటి కార్యదర్శి, ఓఇఎెజ ఆనీ మాజీ సెక్రటరీ ఆర్.చంద్రశేఖర్, ఆఉఖ హరీష్ కుమార్ గుప్తా, ఎెఇఅ ఆవజూబి. సెక్రటరీ కాటమనేని భాస్కర్ తదితరులు ఈ వర్క్ షాపుకు హాజరయ్యారు.ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికాకులకు మార్గనిర్దేశం చేశారు. వర్క్‌షాప్‌కు వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సీఈవో ప్రకాష్ కుమార్, డబ్ల్యుజీడీటీ డీన్ కమల్ దాస్‌తో సహా పలువురు నిపుణులు వస్తారని చెప్పారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చ జరుగుతుందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, వచ్చే ఫలితాలపై కేస్ స్టడీస్ పరిశీలన చేయాలని సూచించారు. ఏయే విభాగాల్లో ఎటువంటి సాంకేతికను వినియోగించవచ్చు, ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా సేవల్ని ఎలా విస్తృత పరచవచ్చు అనే దానిపై ప్రజంటేషన్ ఇస్తామన్నారు. ఏఐ, ఎంఎల్, డీఎల్, చాట్ జీపీటీ, జెమిని, డేటా డ్రివెన్, ఎవిడెన్స్ బేస్డ్ గవర్నెన్స్, ఏఐ ప్లేబుక్, ఏఐ బేస్డ్ పైలెట్ ఐడియాస్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పలువురు నిపుణులు వివరిస్తారన్నారు.

## ఉగ్రదాడిపై పవన్ ఫైర్

### అలా అడిగి మరీ చంపారంటే ఎంతటి దారుణం..



నెల్లూరు, ఏప్రిల్ 24:(శ్రీచక్ర) జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మధుసూదనరావుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళులర్పించారు. గురువారం కావలి చేరుకున్న పవన్.. నేరుగా మధుసూదనరావు ఇంటికి వెళ్లి.. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆపై కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో కిరాతకంగా తూటాలు పేలిస్తే, దేశ వ్యాప్తంగా మధుసూదనరావుకు నివాళులర్పించారన్నారు. ఈ సంఘటనను కుటుంబ సభ్యులు ఇంకా నమ్మలేకపోతున్నారని తెలిపారు. వారితో మాట్లాడినప్పుడు... ఆయన భార్య, పిల్లలు ఏం జరిగింది.. ఎలా జరిగిందో చెప్పారన్నారు.వాళ్లు చెబుతుంటే తనకే పేగులు మెలబెట్టినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ధర్మాన్ని ఆచరిస్తారని తెలుసుకుని హతమార్చారంటే ఎంతటి దారుణమని మండిపడ్డారు. తాను మాట్లాడలేక పోతున్నానని.. రేపో, ఎల్లుండో మంగళగిరిలో ప్రెస్‌మీట్ పెట్టి అన్ని వివరిస్తానని తెలిపారు. వైజాగ్ కూడా వెళుతున్నానని చెప్పారు. ఎంత శాడిస్టికల్‌గా, మెతడాలికల్‌గా, కోల్డ్ బ్లెడెడ్‌గా చంపేశారన్నారు. కాశ్మీర్ రెండేళ్లుగా ప్రశాంతంగా ఉందనే ఇంతటి దారుణానికి, కిరాతకానికి పాల్పడ్డారని మండిపడ్డారు. సమ్మర్‌లో షూటింగ్ కోసం కాశ్మీర్‌కు చాలా సార్లు వెల్లానని.. అక్కడ పరిస్థితులు తనకు తెలుసన్నారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా నిర్దాక్షిణ్యంగా ఏరేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పవ న్ వెంట మంత్రు లు ఆనం,నాదెండ్ల,సత్యకుమార్, ఎమ్మెల్యేలుకావ్యా కృష్ణారెడ్డి, సోమిరెడ్డి, ఆర్ఎస్ఎస్ జాతీయనేత మధుకర్ ఉన్నారు.కాగా.. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రమూకల దాడిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధుసూద న్‌రావు ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడ్డ మధుసూదన్ ఫ్యామిలీతో కలిసి పహల్గామ్ విహారాయత్రకు వెళ్లారు. అయితే ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదా డిలో అతడు మృతి చెందాడు. బుధవారం రాత్రి మధుసూదన్ మృతదేహాన్ని చెన్నై ఎయిర్ పోర్టుకు.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన నెల్లూరు జిల్లా కావలికి తీసుకొచ్చారు. కుమా రుడి మృత దేహాన్ని చూసి తల్లిదం డ్రులు కన్నీమున్నీరుగా విలపించారు. ఇక పెహల్గామ్ ఉగ్రదాడిలో మరో ఏపీ వాసి కూడా ప్రాణాలు కోల్పో యాడు. విశాఖకు చెందిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి దాడిలో మృతిచెందాడు.

## మెట్రోలో బెట్టింగ్ యాప్‌ల ప్రకటన.. హైకోర్టులో పిల్

హైదరాబాద్:(శ్రీచక్ర) బెట్టింగ్ యాప్ వాడకం ఇప్పుడు తీవ్ర సమస్యగా మారింది. ఈ బెట్టింగ్ యాప్‌లను అరికట్టేందకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుంది. అయితే తాజాగా మెట్రో రైలులో బెట్టింగ్ యాప్‌ల గురించి ప్రకటన రావడంపై హైకోర్టులో పిల్ దాఖలైంది. నాగూర్‌బాబు అనే న్యాయవాది ఈ పిల్‌ని దాఖలు చేశారు. బెట్టింగ్ యాప్‌లను ప్రభుత్వం నిషేధించినా.. మెట్రో రైలులో ప్రకటన రావడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని బెట్టింగ్ యాప్‌లపై ఇడి విచారణ కొనసాగుతోందని.. మెట్రో రైలులో ఈ ప్రకటనలపై దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపారు. అయితే 2022లోనే మెట్రో రైలులో బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలు నిలిపివేశామని.. మెట్రో సంస్థ తరుపు న్యాయవాది అన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని కోరారు. ఇరువురి వాదనలు విన్న కోర్టు.. తదుపరి విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది.




## ప్రధాని సభకు చురుగ్గా ఏర్పాట్లు

### మరోమారు అధికారులతో కలసి పరిశీలించిన మంత్రి
### ప్రధాని రాకతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు



అమరావతి,ఏప్రిల్24((శ్రీచక్ర) ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ మే2వ తేదీన రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ప్రధాని ఏర్పాట్లకు సంబంధించి ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. గురువారం సభ ఏర్పాటు చేసే వేదికను మంత్రి నారాయణ, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి రాజధాని పనులు పునః ప్రారంభానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని తెలిపారు. మే 2వ తేదీన మోదీ రాకకు ఏర్పాట్లు- చేస్తున్నామని చెప్పారు. ప్రధాని పర్యటన సందర్భంగా 8 రోడ్డులను పోలీస్ అధికారులు గుర్తించారని.. ఎక్కడ ట్రాఫిక్ జామ్ నెలకొనకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ అన్నారు. ప్రధాని సభ కోసం వచ్చే వారు వాహనాలు పార్కింగ్ చేయడానికి 11 ప్రాంతాలను గుర్తించామని మంత్రి నారాయణ తెలిపారు. వైసీపీ హయాంలో గత ఐదు సంవత్సరాలు అమరావతి రైతులు ఇబ్బంది పడ్డారని చెప్పారు. కనీసం ముగ్గురు, నలుగురు అమరావతి రైతులను పిలిచి సన్మానించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావించారని అన్నారు. ప్రధాని కేవలం గంటన్నర మాత్రమే అమరావతి పర్యటన కోసం సమయం ఇచ్చారని తెలిపారు. ప్రధాని మోదీ భద్రత దృష్ట్యా పటిష్ట చర్యలు చేపడుతున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. అదనపు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్నామని మంత్రి నారాయణ చెప్పారు. ప్రజలు ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరిస్తే చేస్తామని.. లేకపోతే భూసేకరణ విషయంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు. హైదరాబాద్‌లో గతంలో ఒక ఎయిర్‌పోర్ట్ ఉండేదని... అయినా శంషాబాద్ నిర్మించారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ఇప్పుడు రెండో ఎయిర్‌పోర్ట్ లేకపోతే పదిశాతం విమానాలు కూడా దిగేవి కావని అన్నారు. రానున్న 100 సంవత్సరాలను దృష్టిలో పెట్టు-కొని సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణాన్ని ఏర్పాటు- చేస్తున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### ఐదుగురు మావోలు మృతి



ఛత్తీస్‌గఢ్, ఏప్రిల్ 24(శ్రీచక్ర) : ఛత్తీస్‌గఢ్ మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ధర్మతాళ్లగూడెం అటవీప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఐదు గురు మావోల మృతదేహాలను పూజారీ కాంకేర్ ఎస్టీ ఎఫ్ బల గాలు స్వాధీనం చేసుకున్నాయి. కాగా.. గత మూడు రోజులుగా తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహ ద్దుల్లో ఉన్న కర్రెగుట్టలో భద్రతా బలగాల కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇటు తెలంగాణ వైపు నుంచి అటు ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి బలగాలు విడిపోయి మరీ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. దాదాపు 145 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కర్రెగుట్టలు మావోయిస్టులకు పెట్టని కోటగా ఉంది. ఇప్పటి వరకు తెలంగాణ క్యాడర్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన క్యాడర్ కూడా ఇందులో తలదాచుకున్నట్లు, మావోయిస్టులు ఇక్కడే తిష్టవేసినట్లు భద్రతా బలగాలకు ఉన్న సమాచారం మేరకు ఆపరేషన్ కగార్‌ను ఇటు వైపు మళ్లించారు. కర్రెగుట్టల చుట్టూ దాదాపు పది నుంచి 12వేల మంది బలగాలను మోహరించి మూడు రోజులుగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు మావోయిస్టులు ఎదురుపడితే వారిని భద్రతా బలగాలు కాల్చిచంపినట్లు సమాచారం. అయితే పూర్తిస్థాయి వివరాలు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.మూడు రోజులుగా కూంబింగ్ చేస్తున్న భద్రతా బలగాలకు ఆహారం సరఫరా చేసేందుకు మూడు హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. ఆహారంతో పాటు ఆయుధ సామాగ్రిని ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు. 145 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కర్రెగుట్టల్లో పూర్తి స్థాయిలో ఆపరేషన్ పూర్తి చేసిన తర్వాతే వెనుతిరగాలని భద్రతా బలగాలు, కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక నెల రోజుల నుంచి వ్యూహ ప్రతివ్యూహాలు నడుస్తున్నాయి

# సంపాదకీయం

## భారత్ యాక్షన్ షురూ..

కశ్మీర్ లోని పెహల్ గాంలో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కశ్మీర్ లోని పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఉగ్ర దాడి వెనుక దాయాదీ దేశం పాకిస్తాన్ హస్తం ఉందని నిర్ధారించిన భారత్? పాక్ తో సంబంధాలను పూర్తిగా నిలిపివేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన భద్రతపై కేబినెట్ కమిటీ భేటీలో కేంద్రం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఈ నిర్ణయంతో పాక్ తో భారత్ సంబంధాలు పూర్తిగా రద్దు అవుతాయి. పాక్ పౌరులను ఏ రకంగానూ భారత్ లోకి అనుమతించరు. అంతేకాకుండా పాక్ తో దౌత్యపరమైన సంబంధాలు కూడా పూర్తిగా నిలిచిపోనున్నాయి. భద్రతపై కేబినెట్ కమిటీ భేటీ ముగిసిన వెంటనే కేంద్రం తీసుకున్న నిర్ణయాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ప్రస్తుతం భారత్ లో ఉన్న పాక్ పర్యాటకులతో పాటు ఇతరత్రా పనుల నిమిత్తం భారత్ వచ్చిన ఆ దేశ పౌరులు భారత్ ను వీడేందుకు కేవలం 48 గంటల వ్యవధిని ఇస్తున్నట్లు మిస్రీ తేల్చి చెప్పారు. అంటే.. గురు, శుక్రవారా ల్లోగా పాక్ పౌరులు భారత్ ను వీడాల్సి ఉంటుంది. ఇకపై భారత్ లోకి పాక్ పర్యాటకులను గానీ, ఇతరత్రా ఏ కారణాలతో అయినా గానీ ఆ దేశ పౌరులను అనుమతించేది లేదని కూడా తేల్చి చెప్పారు. అంతేకాకుండా భారత్ లోని పాక్ హై కమిషనర్ ను దేశం వదిలి వెళ్లిపోవాల్సింది ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. పాక్ ఇప్పటిదాకా కొనసాగుతున్న భారత సంబంధాలు పూర్తిగా స్తంభించనున్నాయి. ఇరు దేశాల మధ్య ఉన్న అటారీ–వాఘా సరిహద్దును తక్షణమే మూసివేస్తున్నట్లుగా మిస్రీ వెల్లడించారు. అంతేకాకుండా ఇరు దేశాల మధ్య అమలు అవుతున్న సింధూ జలాల ఒప్పందాన్ని కూడా తక్షణమే నిలిపివేస్తున్నట్లుగా కూడా కేంద్రం నిర్ణయం తీసుకుందని ఆయన ప్రకటించారు. జమ్మూకశ్మీర్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ ఉందని భారత్ నిర్ధారణకు వచ్చింది. ఆదేశంపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉగ్రదాడి వెనుక పాకిస్తాన్ హస్తం ఉందన్న దానికి తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని కేంద్రం ప్రకటించింది. 1960లో ఒప్పందం చేసుకున్న సింధు నదీ జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇస్లామాబాద్‌లోని భారతీయ హైకమిషన్‌ను మూసివేయాలని నిర్ణయించారు, అలాగే పాకిస్తాన్ నుంచి భారత దౌత్యవేత్తలను వెనక్కి రప్పించాలని నిర్ణయించారు. భారత్‌లో ఉన్న పాకిస్తాన్ సైనిక సలహాదారులను "పర్సోనా నాన్ గ్రాటా" గా ప్రకటించారు, వారిని దేశం విడిచి వెళ్లమని ఆదేశించారు.పాకిస్తాన్‌తో అన్ని నయతంత్ర సంబంధాలను తెంచుకునే దిశగా పరిశీలన చేస్తున్నారు. పాక్ హైకమిషనర్‌ను ఇండియా నుంచి పంపించేయాలని నిర్ణయించారు. పెహల్ గాం ఉగ్ర దాడి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల మార్గదర్శకత్వంలోనే జరిగిందని, దాడికి పాకిస్తాన్ సైన్యాధిపతి నుంచి కూడా పూర్తిగా సహకారం అందిందన్న ఆధారాలు కూడా లభ్యమయ్యాయి. దీంతోనే ఈ దాడిని ఈజీగా తీసుకోరాదన్న నేపథ్యంలో కేంద్రం కఠిన నిర్ణయాన్ని తీసుకుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పహల్గామ్‌లో జరిగిన దారుణ ఉగ్రదాడి వెనుక ఉన్నది తామేనంటూ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించుకోవడంతో, ఈ సంస్థ మళ్లీ వార్తల్లోకి వచ్చింది. ఈ దాడిలో 25 మందికి పైగా పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనతో 'టీఆర్ఎఫ్' గురించి మరోసారి చర్చ మొదలైంది. అసలు ఈ టీఆర్ఎఫ్ ఎవరు? దీని వెనుక ఎలాంటి శక్తులు పనిచేస్తున్నాయి? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.2019 ఆగస్టులో కేంద్రం ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత పాక్ ప్రోత్సహంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ, పాకిస్థాన్ ఉగ్రసంస్థ లష్కరే తోయిబాకు అనుబంధంగా పనిచేస్తున్నట్టు గుర్తించారు. ఏర్పడిన తక్కువ సమయంలోనే ఈ సంస్థ కశ్మీర్ లో తన ఉనికిని చాటుకుంది. హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహ్మద్ లాంటి ఉగ్ర సంస్థల సభ్యులను టీఆర్ఎఫ్‌లో చేర్చుకుని, దాడులకు సరికొత్త వ్యూహాలను రచించింది. భారత హోంమంత్రిత్వ శాఖ 2023 జనవరిలో ఈ సంస్థను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం నిషేధించిందిఈ సంస్థకు షేక్ సజ్జాద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, బాసిత్ అహ్మద్ దార్ ఆపరేషనల్ చీఫ్‌గా వ్యవహరించారు. ట్రెండింగ్ సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని, ఈ సంస్థ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రమైన హింసను రెచ్చగొడుతోంది. కాశ్మీరీ పండిట్లు, స్థానిక పోలీసులు, కార్మికులు, పర్యాటకులు, వ్యాపారస్తులు వంటి సాఫ్ట్ టార్గెట్లను ఎంచుకుని హింసకు పాల్పడుతోంది. తాజాగా పహల్గామ్‌లో జరిగిన దాడి ఈ వ్యూహానికే ఉదాహరణగా చెబుతున్నారు.2018లో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో పెట్టడంతో, లష్కరే తోయిబా తరఫున పాక్ గూఢచార సంస్థ (ఐఎస్ఐ) ఈ టీఆర్ఎఫ్‌ను సృష్టించిందని విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా దృష్టి మరల్చేందుకే కొత్త పేరుతో పాత ఉగ్ర సంస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి పాక్ ఈ వ్యూహానికి తెరతీసింది. ఈ సంస్థ గతంలో గందర్‌బల్‌లో ఓ వైద్యుడితో పాటు కార్మికులు సహా ఏడుగురిని పొట్టనబెట్టుకుంది. అంతేకాకుండా 2020లో కుప్వారా సెక్టార్‌లో జరిగిన పోరులో ఐదుగురు భారత జవాన్లు వీరమరణం పొందడం కూడా ఇదే సంస్థ పనే.ప్రస్తుతం అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో ఈ సంస్థ కార్యకలాపాలపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. పహల్గామ్ ఘటన తర్వాత ఈ సంస్థపై మరింత నిఘా పెంచారు.

## వైసీపికి కొత్త వ్యూహకర్త..రుషిరాజ్ సింగ్

విజయవాడ, ఏప్రిల్ 24(శ్రీచక్ర) , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టి పెట్టారు. పార్టీ ఓటమిపాలై ఏడాది కావస్తున్న తరుణంలో పార్టీ ప్రక్షాళనకు దిగారు. ముందుగా పార్టీలో సమూల మార్పులు తీసుకురావాలని భావించారు. అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నారు. గత ఎన్నికల్లో అంతులేని ధీమాతో బరిలో దిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీ ప్రజలు చావు దెబ్బ కొట్టారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. వై నాట్ 175 అన్న నినాదంతో బరిలోకి దిగిన ఆ పార్టీకి ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురయింది. అయితే ఇప్పుడిప్పుడే తప్పిదాలను గమనించిన జగన్మోహన్ రెడ్డి దిద్దుబాటు చర్యలకు దిగుతున్నారు. పోయిన చోట వెతుక్కునే పనిలో పడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా 30 మంది సీనియర్ నేతలతో కూడిన పొలిటికల్ అడ్వైజరీ కమిటీనిప్రకటించారు. సభ్యత్వ నమోదు చేపట్టనున్నారు. ఇంకోవైపు కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించే ఆలోచన చేస్తున్నారు. కార్యకర్తల పేరుతో సొంత నిధులతో ఈ బీమా సౌకర్యం కల్పించే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో దీనిపైనే ప్రధానంగా చర్చ నడిచింది. వీలైనంతవరకు నియోజకవర్గ ఇన్చార్జిలను మార్చుతూ జిల్లాల పర్యటనకు దిగాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. అయితే గత ఐదేళ్లలో వైఫల్యాలను గుర్తుచేసుకొని మరి ప్రజల్లోకి వెళ్లాలని ఒక అంచనాకు వచ్చారు.అయితే 2024 ఎన్నికల్లో సోషల్ ఇంజనీరింగ్ కు నమ్ముకున్న జగన్మోహన్ రెడ్డికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఐపాక్ టీం ఇచ్చిన నివేదికలను ఆధారంగా చేసుకుని పార్టీలో చేర్పులు మార్పులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 80 నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చి చేతులు కాల్చుకున్నారు. అందుకే వారిని తిరిగి యధా స్థానాల్లో నియమించాలని చూస్తున్నారు. ఇప్పటికే చాలామందిని మార్చారు కూడా. అయితే ఉమ్మడి 13 జిల్లాల్లో.. ఎక్కడెక్కడ మార్పులు చేయాలి? ఎవరిని నియమించాలి? ఏ సామాజిక వర్గాన్ని పరిగణలోకి తీసుకోవాలి అన్నదానిపై వ్యూహకర్తలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.2019 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రశాంత్ కిషోర్ వ్యూహకర్తగా సేవలు అందించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన జగన్మోహన్ రెడ్డికి దూరమయ్యారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా పనిచేశారు. సలహాలతో పాటు సూచనలు అందించారు. అయితే ప్రశాంత్ కిషోర్ మరోసారి జగన్మోహన్ రెడ్డికి పనిచేసే పరిస్థితి లేదు. అలాగని జగన్మోహన్ రెడ్డి సైతం ప్రశాంత్ కిషోర్ ను పిలిచే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఈ తరుణంలో రుషిరాజ్ సింగ్ మరోసారి జగన్మోహన్ రెడ్డి కోసం రంగంలోకి దిగారు. గత కొద్ది రోజులుగా బెంగళూరులోని యలహంక ప్యాలెస్ లో రుషిరాజ్ సింగ్ తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న చాలామంది వ్యూహకర్తలతో జగన్మోహన్ రెడ్డి సమావేశం అయ్యారని.. వారి సలహాలు సైతం తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. త్వరలో జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనకు వెళుతున్న తరుణంలో ఈ సమావేశాలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

## అక్రమ భూములపై ఆరోపణలు నిరాధారమైనవే

### బద్వేలు మాజీ ఎమ్మెల్యే వైకాపా ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి

బద్వేలు,(శ్రీచక్ర) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆయన తమ్ముడు, కాశినాయన మండల జడ్పిటిసి సభ్యుడు సత్యనారాయణ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమపై వస్తున్న భూమి ఆక్రమణ ఆరోపణలను వారు ఖండించారు."చర్యలకు సిద్ధంగా ఉన్నాం""నా తమ్ముడు నాయనపల్లె పంచాయతీలో ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేశారని ఎవరికైనా నమ్మకమైతే, నిరూపిస్తే ఆ భూమిని వారికి వదిలేస్తాం," అని గోవిందరెడ్డి స్పష్టం చేశారు. అధికారులు విచారణ చేయాలన్న డిమాండ్ చేస్తూ, "జిల్లా కలెక్టర్ బద్వేలు, ఆర్డీవో ఎంక్వయిరీ జరిపి అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు" అని తెలిపారు."రాజకీయ ప్రస్థానం, నిస్వార్థ సేవే మా బలం"తన రాజకీయ జీవితాన్ని గుర్తుచేసుకున్న గోవిందరెడ్డి గారు, "మేము 20 సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉన్నాం. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, నా ఆధ్వర్యంలో 20 వేల ఎకరాల భూమి పంపిణీ జరిగింది. అందులో ఒక్క ఎకరా కూడా నా బంధువులకు గానీ, తమ్ముడికి గానీ ఇవ్వలేదు" అని తెలిపారు."మీడియా కథనాలు అసత్యం"కొంతమంది మీడియా ప్రతినిధులు తప్పుడు కథనాలు ప్రచురించడం బాధాకరమని గోవిందరెడ్డి గారు అభిప్రాయపడ్డారు. "ఆంధ్రప్రభ విలేకరి మా తమ్ముడిని కలిసి '15 ఎకరాలు భూమి కావాలి' అని అడిగారు. మా తమ్ముడు ఆ అభ్యర్థనను తిరస్కరించడంతో, కక్షపూరితంగా కథనాలు రాస్తున్నారు," అని ఆరోపించారు.మా తమ్ముడు 300 ఎకరాలు ఆక్రమించాడని కొన్ని కథనాల్లో వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఎంక్వయిరీకి మేము సిద్ధంగా ఉన్నాం. నిజాయితీగానే ముందుకు సాగుతాం," అని గోవిందరెడ్డి స్పష్టం చేశారు"నాకు ఒక ఎకరా డీకే టి భూమి కూడా లేదు""నాకు ఆక్రమించాలనే మతి ఉంటే, మా అన్నయ్య ఎమ్మెల్యేగా ఉన్న టైమ్‌లోనే చేసేవాడిని. కానీ నేడు నాకు ఒక డికెట్టు భూమి కూడా లేదు," అని సత్యనారాయణ రెడ్డి తేల్చిచెప్పారు.


## పాక్ హైకమిషన్ వద్ద భారీ నిరసన..

### పహల్గామ్ ఉగ్రదాడిపై జనం ఆగ్రహం




న్యూఢిల్లీ(శ్రీచక్ర)_: జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల భారీగా జనం గుమిగూడి నిరసన తెలిపారు.భారత్‌లో ఉగ్ర దాడులకు పాల్పడుతున్న ఆ దేశంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ భారీ నిరసన నేపథ్యంలో పాకిస్థాన్ హైకమిషన్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. జాతీయ జెండాలను చేతపట్టి నిరసన చేస్తున్న జనాన్ని శాంతింపజేసేందుకు పోలీసులు ప్రయత్నించారు.కాగా, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్య సంబంధాలు మరింతగా దెబ్బతిన్నాయి. పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక ఎక్స్ ఖాతా వినియోగాన్ని భారత్ నిలిపివేసింది. దశాబ్దాల నాటి సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. పాకిస్థాన్ దౌత్య సిబ్బందిని బహిష్కరించింది. భారత్, పాకిస్థాన్ హైకమిషన్లలోని సిబ్బంది సంఖ్యను 55 నుంచి 30కు తగ్గించింది.మరోవైపు ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ నుంచి రక్షణ, నౌకాదళం, వైమానిక సలహాదారులందరినీ భారత్ బహిష్కరించింది. వారంలోగా దేశం విడిచి వెళ్లాలని వారికి సూచించింది. అలాగే ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ నుంచి సైనిక సలహాదారులను ఉపసంహరించింది. ఇరు దేశాల రాయబార కార్యాలయాల్లో సేవా సలహాదారులకు కేటాయించిన ఐదుగురు సహాయక సిబ్బందిని కూడా భారత్ రీకాల్ చేసింది.

## వాఘా బోర్డర్‌ను మూసివేసిన పాకిస్థాన్



న్యూఢిల్లీ: (శ్రీచక్ర) పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో వాఘా బోర్డర్‌ను మూసివేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. నేషనల్ సెక్యూరిటీ కమిటీ(ఎన్ఎస్సీ) సమావేశం తర్వాత ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. కశ్మీర్‌లో జరిగిన దాడి తర్వాత భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్.. అత్యవసరంగా ఎన్సీసీ మీటింగ్‌ను నిర్వహించింది. పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ఆధ్వర్యంలో మీటింగ్ జరిగింది. ఆ భేటీలో టాప్ సివిల్, మిలిటరీ నేతలు పాల్గొన్నారు. పెహల్గామ్ ఘటన తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలకు కౌంటర్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. పాక్ ప్రధాని కార్యాలయం తన ప్రకటనలో ప్రాంతీయ భద్రతా, జాతీయ భద్రతా పర్యావరణం గురించి పేర్కొన్నది. 1972లో కుదిరిన సిమ్లా ఒప్పందాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. దీంతో వాఘా బోర్డర్‌ను మూసివేశారు.

## పాలన లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు వినియోగం పై వర్క్ షాప్

అమరావతి(శ్రీచక్ర) ,'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్సఫర్మేషన్' అంశంపై సచివాలయంలో ఉన్నతాధికారులతో వర్క్షాప్ నిర్వహించారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు వర్క్షాప్కు హాజరై, ప్రారంభోపన్యాసం చేసారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేసారు. వర్క్షాప్కు సీఎస్, డీజీపీ, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీ శాఖ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు. వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సీఈవో ప్రకాష్ కుమార్, డబ్ల్యూజీడీటీ డీన్ కమల్ దాస్తో సహా పలువురు నిపుణులు పాల్గొన్నారు. గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చ జరిగింది.

## మాజీ మంత్రి విడుదల రజనికి షాక్

### హైదరాబాద్ లో మరిది గోపీ అరెస్టు

### విశాఖ ఎయిర్ పోర్టులో రజని అడ్డగింత

మాజీమంత్రి విడదల రజిని మరిది విడదల గోపీని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని విప్రో సర్కిల్ వద్ద గురువారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు గోపిని అరెస్ట్ చేసి గచ్చిబౌలి స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి ఆయన్ను విజయవాడ తరలించారు. వైసీపీ పాలన హయాంలో పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీ లక్ష్మి స్టోన్ క్రషన్ నిర్వాహకులను బెదిరించి రూ.2. 20 కోట్లు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో మాజీమంత్రి విడుదల రజనితోపాటు ఆమె మరిది గోపిపైనా కేసు నమోదైంది. వీరికి సహకరించిన ఐపీఎస్ అధికారి జాషూవా సహా మాజీ మంత్రి రజని పీఏ రామకృష్ణపైనా కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం మాజీమంత్రి రజనీతోపాటు ఆమె మరిది గోపి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ హైకోర్టులో విచారణ దశలో ఉండగానే ఏసీబీ అధికారులు గోపిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఈ కేసు కొట్టివేయాలంటూ విజిలెన్స్ అధికారి జాషువా సైతం క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సైతం విచారణ దశలోనే ఉంది. ఈ కేసులో సహ నిందితురాలిగా ఉన్న విడదల రజనీ విదేశాలకు వెళ్లకుండా రెడ్ అలర్ట్ జారీ చేశారు. ప్రస్తుతం ఆమెను విశాఖపట్నం ఎయిర్ పోర్టులో నిర్బంధించినట్టు సమాచారం.

## పహల్గాంలో ఉగ్రదాడి ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది...

### మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి

### చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు,(శ్రీచక్ర) జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గమళ్ళ ప్రసాదరావు.జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ప్రాంతంలో ట్రెక్కింగ్‌లో ఉన్న పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేసిన ఘటన కాశ్మీర్ నే గాక దేశాన్నే కుదిపేయడం పై గురువారం ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.పహల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి పిరికిపందల చర్య ఆయన ఖండించారు. ఈ దాడిలో 30 మంది చనిపోవడం, మరికొంత మంది గాయపడటం తనను బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని వాళ్లు ఉండటం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలబడం అభినందనీయమన్నారు. అలాగే ఉగ్రవాదం పై పోరుకు యావత్ దేశం కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## విజయ మిల్క్ యూనిట్ లో మానవహారం

విజయవాడ,(శ్రీచక్ర) పహల్గం ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ విజయవాడ లోని కృష్ణ మిల్క్ యూనియన్ (విజయ) మిల్క్ ఫ్యాక్టరీలో మానవహారం ఏర్పాటు చేసారు. ఈ మానవహారంలో పాల్గొని ఉగ్రవాదులు దాడిని ఎంపీ కేశినేని శివనాథ్ ఖండించారు.ఎంపి మాట్ఆడుతూ పహల్గం ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఈ దాడి పాకిస్తాన్ ఆధ్వర్యంలోనే జరిగింది. ఉగ్రవాదులు దాడుల్లో గాయపడిన వారికి సానుభూతి తెలియజేయడంతోపాటు మృతి చెందిన వారికి సంతాపం ప్రకటించారు. ఇలాంటి అమానుషమైన దాడులకు పాల్పడిన వారిని ప్రేరేపించిన వారిని కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుంది. దేశ ప్రజలందరూ ఐక్యమత్యంగా ఒకటై ఉంటున్న సమయంలో విభేదాలు సృష్టించటానికి ఉగ్రవాదమూకలు ఈ దాడికి పాల్పడ్డారు. అరాచక శక్తుల్ని కఠినంగా శిక్షించాలని దేశ ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుకుంటున్నారని అన్నారు.దేశాభివృద్ధిని చూసి ఓర్వలేక పాకిస్తాన్ ఆధ్వర్యంలో ఉగ్రవాదులు ఈ ఉన్మాద చర్యకు పాల్పడ్డారని అన్నారు.ఈ కార్యక్రమంలో అర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి పతావుల్లా, రాష్ట్ర తెలుగు మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఆషా, రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), మేనేజింగ్ డైరెక్టర్ ఈశ్వర్ బాబు పాల్గొన్నారు.

## ఇంక పాకిస్తాన్ కు నీటి కష్టాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24,(శ్రీచక్ర) )పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో మరోసారి పాకిస్థాన్ కుట్ర బయటపడుతోంది. రహస్య సమాచార వర్గాల ప్రకారం, ఉగ్రవాద దాడి పాకిస్థాన్‌లోనే స్కెచ్ వేశారని తెలుస్తోంది. దాడి వెనుక హఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడైన సైఫుల్లా కసూరి చేయి ఉందని చెబుతున్నారు. అందుకే పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడానికి భారతదేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో అత్యంత ముఖ్యమైన నిర్ణయం సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయడం. భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయంతో పాకిస్థాన్ నీటి కోసం దిక్కుతోచని స్థితిలో పడే ప్రమాదం ఉంది. పహల్గాం ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలను బలిగొన్నారు. అప్పటి నుంచి యావత్ భారతం ఆగ్రహంతో ఊగిపోతోంది. పాకిస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటారనే ఆసక్తితో కేంద్రంవై? ప్రజలంతా ఎదురు చూశారు. ప్రధానమంత్రి మోడీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 1960లో జరిగిన సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయాలని నిర్ణయించారు. భారతదేశం తీసుకున్న ఈ నిర్ణయం ఒక్కసారిగా పాకిస్థాన్ మొత్తం దాహం కేకలతో అల్లాడిపోనుంది. ఇంతకీ సింధు జల ఒప్పందం గురించి పూర్తి వివరాలు ఏంటో చూద్దాం. భారత–పాకిస్థాన్ విభజన తరువాత రెండు దేశాల నీటి అవసరాలను తీర్చడానికి ఈ ఒప్పందం కుదిరింది. 1960 సెప్టెంబర్ 19న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయుబ్ ఖాన్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. దీని ప్రకారం, బ్యాస్, రావి, సట్లెజ్, సింధు, చినాబ్, జీలం అనే ఆరు నదుల నీటి వినియోగానికి సంబంధించిన నియమాలు నిర్ణయించారు.

# యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ లను తనిఖీ చేస్తున్న కర్నూలు పోలీసులు





కర్నూలు, ఏప్రిల్ 24 (శ్రీచక్ర): కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఈవ్ టీజింగ్, ఆకతాయి పనులకు పాల్పడే వారి పై జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పోలీసు అధికారులు హెచ్చరించారు. జిల్లాలోని ఆయా కళాశాలల వద్ద యాంటీ ఈవ్ టీజింగ్ బీట్ లను తనిఖీ చేస్తున్నారు. ఈవ్ టీజింగ్ , ఆకతాయిల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన చేస్తున్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాంటీ ఈవ్ టీజింగ్ ను అరికట్టాలనే ఉద్దేశ్యంతో జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజింగ్ బీట్స్ ను కొత్తగా అమలులోకి తీసుకొచ్చారు. వివిధ కళాశాలల వద్ద ఈవ్ టీజింగ్ ను అరికట్టడం కోసం ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 36 ఈవ్ టీజింగ్ బీట్స్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈవ్ టీజింగ్ ను అరికట్టేందుకు ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఈవ్ టీజింగ్ పాల్పడే వారి పై నిఘా ఉంచి 11,825 మందిని జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో కళాశాలలు, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ బీట్స్ పోలీసులు కౌన్సిలింగ్ చేశారు.

## శ్రీశ్రీశ్రీ సుంకులపరమేశ్వరి ఆలయం, విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి





ఓర్వకల్, ఏప్రిల్ 24 (శ్రీచక్ర): పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామంలో వైఎస్ఆర్సీపీ నాయకులు ఆహ్వానం మేరకు గ్రామంలో శ్రీశ్రీశ్రీ సుంకులపరమేశ్వరి అమ్మవారిఆలయం, విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని గురువార ప్రత్యేకపూజలునిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నగరపాలక మేనేజర్‌కు అదనపు బాధ్యతలు

కర్నూలు, ఏప్రిల్ 24 (శ్రీచక్ర): నగరపాలక సంస్థ మేనేజర్ యన్.చిన్నరాముడికి, కమిషనర్ యస్.రవీంద్ర బాబు అదనపు బాధ్యతలు కేటాయించారు. ప్రజా సంబంధాల అధికారి కే.ఎల్.యన్. రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం పొదిలి కమిషనర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో, ఆయన నిర్వర్తించిన బాధ్యతలను కమిషనర్ మేనేజర్ చిన్నరాముడికే అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



# గ్రామీణాభివృద్ధి, స్థానిక పాలనలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీరాజ్ వ్యవస్థ

### పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేరువగా ప్రభుత్వం:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా









కర్నూలు, ఏప్రిల్ 24 (శ్రీచక్ర): గ్రామీణాభివృద్ధి, స్థానిక పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో ఉన్న పంచాయతీ రాజ్ వ్యవస్థకు, 1947 స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉన్న పరిస్థితికి చాలా వ్యత్యాసం ఉందన్నారు.. 73 వ సవరణ కు ముందు స్థిరమైన లేదా ప్రామాణిక యంత్రాంగం ఉండేది కాదన్నారు..స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు లేవని, ఉండేవి కాదని, మహిళలకు ప్రాతినిధ్యమే ఉండేది కాదని తెలిపారు.. మహిళలు అయితే గుర్తించే వారే కాదన్నారు....ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని, సింఘ్వీ, బల్వంత్ రాయ్ మెహతా తదితర కమిటీలు, దేశంలో ఉన్నఅత్యున్నత మేధావులు, సంస్థలు అధ్యయనం చేసిన తర్వాత 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా 11 వ షెడ్యూల్లో 243 ఆర్టికల్ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ ను రూపొందిస్తూ చట్టం చేశారన్నారు. ఆ చట్టాన్ని రాజ్యసభ, లోక్ సభ తో పాటు అన్ని అసెంబ్లీల్లో కూడా ఆమోదం చేసిన తర్వాత ఏప్రిల్ 24, 1993 సంవత్సరం నుండి అమలు లోకి రావడం జరిగిందన్నారు.. అందుకే ఈరోజును జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.73 వ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థ లో పర్యవేక్షణ వ్యవస్థ బలోపేతం అయిందని కలెక్టర్ తెలిపారు.. పంచాయితీలకు చట్టపరమైన గుర్తింపు ఇవ్వడం, ఆర్థిక స్వయం ప్రతిపత్తి కల్పించడం వంటి సంస్కరణలు వచ్చాయన్నారు.. ఫైనాన్స్ కమిషన్ పరిధిలోకి రావడం, స్టేట్ ఎలెక్షన్ కమిషన్ ద్వారా సక్రమంగా ఎన్నికలు జరపడం, లోకల్ బాడీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ లకు 50 శాతం రిజర్వేషన్, మహిళకు 33 శాతం రిజర్వేషన్ లు కల్పించడం జరిగిందన్నారు.. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయని, ఎంపిడిఓ లు, డి ఎల్ డి వో లు తదితర వ్యవస్థల ద్వారా గ్రామీణాభివృద్ధితో పాటు ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువగా తీసుకువెళ్లడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు..జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలు చేశామని, వేజ్ కాంపొనెంట్, మెటీరియల్ కాంపొనెంట్ లో వంద శాతం లక్ష్యాలను సాధించామని, అదే విధంగా జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణంలో భాగంగా రూ. 80 కోట్లతో 119 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాన్ని 3 నెలల్లో పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. ఇది ఒక ప్రత్యేకమైన విజయమని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో పని చేయాలని కలెక్టర్ పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు.. నేషనల్ ఈ గవర్నెన్స్ అవార్డ్ ల కోసం దేశమంతటా కలిపి లక్షా 40 వేల దరఖాస్తులు రాగా, ఇందులో 6 గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారని, ఆ 6 గ్రామ పంచాయతీలలో మద్దికెర మండలం పెరవలి గ్రామం ఎంపిక నేషనల్ ఈ గవర్నెన్స్ అవార్డ్ కి ఎంపిక కావడం అభినందనీయమన్నారు.. అలాగే ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద జిల్లాలో మద్దికెర, హోళగుంద, చిప్పగిరి మండలాలు ఎంపిక అయ్యాయని, ఇందులో మద్దికెర మండలం సౌత్ ఇండియా రీజియన్ లో మొదటి స్థానంలో ఉండగా, కేంద్రప్రభుత్వం రూ.1.50 కోట్లను మంజూరు చేసిందన్నారు..చిప్పగిరి మండలం కూడా 6 వ స్థానంలో ఉందన్నారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు అవుతున్నాయనడానికి ఇది ఒక ఉదాహరణ అని కలెక్టర్ తెలిపారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను మరింత పటిష్టవంతం చేసేలా వ్యవస్థ పట్ల, ప్రభుత్వ పథకాల అమలు గురించి ప్రజల్లో సమగ్రమైన అవగాహన తీసుకురావాలని, అధికారులకు వ్యవస్థ పైన పూర్తి పట్టు ఉండాలని కలెక్టర్ సూచించారు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందేలా మరింతగా కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, గూడూరు ఎంపిడిఓ శివ నాగ ప్రసాద్ పంచాయతీ రాజ్ వ్యవస్థ గురించి మాట్లాడారు..అనంతరం ఉత్తమ పనితీరు కనపర్చిన పంచాయతీ రాజ్ ఎస్ఈ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఎంపిడిఓలు, ఈఓఆర్డిలు, ఇతర సిబ్బందికి కలెక్టర్ మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేశారు.. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రదాడి హేయమైన చర్య: మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్



కర్నూలు ఏప్రిల్ 24(శ్రీచక్ర): - పెహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య అని కర్నూలు జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ అభిప్రాయపడ్డారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో విడుదల చేసిన ప్రకటనలో కాజా హుస్సేన్ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఉగ్రవాదుల దాడులను ఇప్పుడు ఉన్న బిజెపి ప్రభుత్వం సరైన నిర్ణయంతో కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షులు డిమాండ్ చేశారు. దీనిని కులమ తాలకు దూరం చేసి పెను మార్పులను చేర్చి ఉగ్రవాదుల దాడులకు 30 మంది మరణించారనీ వారిలో ముఖ్యంగా ముందుగా కాల్చి చంపింది ముస్లిం వ్యక్తిని కానీ ఇక్కడ హిందువులను మాత్రమే చంపారు అని రాజకీయం చేయడం తగదని బిజెపి ప్రభుత్వం ఇలాంటి ఉగ్రవాద దాడిని అంతం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్.సి బజారన్న మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ అనంతనాగ్ జిల్లా పహాల్గం గ్రామంలో జరిగిన దమనకాండ ఉగ్రవాదులు జరిపిన ఈ దమనకాండకు యావత్ భారతదేశమే తీవ్రంగా ఖండిస్తుందనీ గతంలో 35 మందికి పైగా ఉగ్రవాదులు ఇలాగే కాల్చి చంపడం జరిగిందనీ అప్పటి ప్రభుత్వం ఉగ్రవాదులను ఏరి పారేయడం జరిగిందని ఇప్పుడు జరిగిన ఉగ్రవాదుల దాడిలో 30 మందిని నిర్ధాక్షణంగా కాల్చి చంపడం హైమైన చర్య అని దీనిని కర్నూల్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందనీ నిరసన కూడా తెలియజేస్తున్నాం. అమిత్ షా ఆ ప్రాంతానికి వెళ్లి చూసినా దానిపై ఎలాంటి చర్యలు ప్రకటించలేదు. రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ ఉగ్ర వాదానికి పాల్పడ్డ వారిని అంతం అందించే వరకు భారత సైన్యం నిద్రపోదు అని ప్రకటించారనీ పహాల్గాం గ్రామంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి 30 మంది చనిపోయారు అలాగే 27 మంది గాయపడ్డారు. జమ్ము కాశ్మీర్లో ప్రభుత్వం చనిపోయిన వారికి ఐదు లక్షల రూపాయలు గాయపడ్డ వారికి రెండు లక్షల రూపాయలు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం చనిపోయిన వారికి 20 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ బజారన్న డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ ఈ లాజరస్ మాట్లాడుతూ దేశరక్షణ కోసం ఎక్కడ లోపం జరిగిందని కాదని తెలియజేస్తున్నాం. ఎందుకు అక్కడ పటిష్ట భద్రత ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తుందని ఎందుకు అక్కడ పర్యాటక ప్రాంతం అని తెలిసి అక్కడ పటిష్ట భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం గల కారణం ఏంటి అని లాజరస్ డిమాండ్ చేశారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు

శ్రీశైలం (శ్రీచక్ర))లోకకల్యాణంకోసం దేవస్థానం ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది.ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది.ఈ పూజాకార్య్ర కమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణప తిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాబి షేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.లోకోద్ధరణకోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది.ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు.కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది.కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు.శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజనగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది.నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు.కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయిం చారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు.శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది



## మే డే ను జయప్రదం చేయండి సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు



వెల్దుర్తి :(శ్రీచక్ర)139 వ మే డే కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జే నాగేశ్వరరావు పిలుపునిచ్చారు గురువారం వెల్దుర్తి సిఐటియు మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో కార్మిక సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ మే 1వ తారీఖున కార్మికులందరూ లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా సోషలిజమే లక్ష్యంగా కార్మిక సంఘాలన్నీ ప్రతిజ్ఞ చేయాలని తెలిపారు. మే డే రోజు స్థానిక సిఐటియు కార్యాలయంలో జెండా ఆవిష్కరణ ఉంటుందని అనంతరం వెల్దుర్తి పట్టణంలోని ప్రధాన వీధులలో కెవిపిఎస్ డప్పు కళాకారుల బృందం వారిచే ప్రదర్శన కార్యక్రమం ఉంటుందని కావున అసంఘటిత రంగ కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాముడు, వెంకట రాముడు, శ్రీను, హమాలి వర్కర్స్ యూనియన్ సభ్యులు మారి, సత్యం, నరేష్, అల్లుగుండు హమాలి వర్కర్స్ రాముడు, తెల్లకృష్ణ, సూర్య, మద్దిలేటి, ఆశా వర్కర్స్ అలివేలమ్మ, జ్యోతమ్మ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో ప్రతిభను చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు




రామచంద్రపురం, ఏప్రిల్ 24(శ్రీచక్ర)బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రామచంద్రపురం శ్రీ చైళతన్య విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. రాము మాట్లాడుతూ కె. సమంత రాజారెడ్డి 590,కె .సంజు 590 ,కె.అశ్విన్ 589,కె . శ్రీ సాయి తపస్వి 589, పి . తన్మయి588 మార్కులు సాధించిపాఠశాలలోమొదటి మూడు స్థానాల్లో నిలిచారని తెలియజేశారు ఈ సందర్భంగా ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థిని విద్యార్థులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య రీజనల్ ఇంచార్జ్ ఎం లక్ష్మి నరేష్ మాట్లాడుతూ రామచంద్రపురం శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా నూటికి నూరు శాతం పాస్ పర్సెంట్ కూడా సాధించారని తెలియజేస్తూ ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారికి సహకరించిన ఉపాధ్యాయులకుమరియుతల్లిదండ్రులకుప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం మంత్రి సుభాష్ తండ్రి సత్యం



కాజులూరు, ఏప్రిల్ 24 శ్రీ (చక్ర)విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అవలంభించాలని, తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి, సత్యం అన్నారు. కాజులూరు మండలం కోలంక గ్రామంలో వింగ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో జరిగిన 8వ వార్షికోత్సవ వేడుకలల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ విద్యకు మించిన సంపద మరొకటి లేదని, ప్రణాళిక బద్ధంగా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. నేటి ఆధునిక యుగంలో విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలోజనసేనపార్టీరామచంద్రపురంఇంచార్జిపొలిశెట్టి చంద్రశేఖర్, హైస్కూల్ ప్రిన్సిపాల్, సిబ్బంది, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం హైస్కూల్ ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపక సిబ్బంది ఈకార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు.

## గుర్రపు స్వారీని వద్దనుకొని.. త్రుటిలో ఉగ్రదాడి నుంచి తప్పించుకున్న కేరళ టూరిస్టులు



న్యూఢిల్లీ: ప్రశాంతంగా ఉండే కశ్మీర్ లోయ తూటాల శబ్దంతో మార్మోగిపోయింది. మంగళవారం మధ్యాహ్నం సమయంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు నరమేధం సృష్టించారు. విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 26 మంది అమాయకుల ప్రాణాలు బలిగొన్నారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే, కొందరు పర్యాటకులు ఈ ఉగ్రదాడి నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో కేరళ రాష్ట్రానికి చెందిన ఓ బృందం కూడా ఉంది.కేరళ రాష్ట్రం నుంచి చిన్నారి సహా దాదాపు 23 మంది కశ్మీర్ పర్యటనకు వచ్చారు. వాళ్లంతా మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో ప్రకృతి అందాలను ఆశ్వాదించేందుకు వెళ్లారు. అయితే, టూరిస్ట్ స్పాట్‌కు వెళ్లాలంటే గుర్రంపైన వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వారు గుర్రపు స్వారీ (ఊనీతీబవ ఖీతిటవ) కోసం ధర ఎక్కువగా ఉండటంతో వేరే ప్రదేశానికి ట్యాక్సీ మాట్లాడుకుని వెళ్లిపోయారు. దీంతో ఈ దాడి నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడినట్లైంది. ఈ భయంకర అనుభవాన్ని సదరు టూరిస్ట్‌లు మీడియాతో పంచుకున్నారు.'వేరే ప్రదేశానికి వెళ్తున్న సమయంలో మాకు కొన్ని శబ్దాలు వినిపించాయి. దుకాణాలు మూసివేస్తున్నారు. ప్రజలు పారిపోతున్నారు. అక్కడ ఏం జరుగుతోందో మాకు అర్థంకాలేదు. మేము అందమైన ప్రదేశానికి తీసుకెళ్లమని మా గైడ్‌ను అడిగాము. అప్పుడు ఆయన అన్నారు.. బతికి ఉండాలనుకుంటున్నారా..? లేదా..? అని. ట్యాక్సీ అతను సరాసరి మా హోటల్ వద్దకు తీసుకెళ్లాడు. టీవీలో వార్తలు చూశాక తెలిసింది.. అక్కడ జరిగింది ఉగ్రదాడి అని. గుర్రపు స్వారీకి వెళ్లి ఉండి ఉంటే.. ఇప్పుడు చనిపోయిన వారిలో మేము కూడా ఉండేవాళ్లం' ' అని తమకు ఎదురైన ఈ భయంకరమైన అనుభవాన్ని మీడియాతో పంచుకున్నారు. అంతేకాదు పర్యాటక ప్రదేశాల్లో ఎక్కడా భద్రత లేదని వారు ఆరోపించారు. ఉగ్రదాడి జరిగిన ప్రదేశంలో భద్రతా సిబ్బంది ఒక్కరు కూడా లేరని అన్నారు. అందుకే వారు ఆ ప్రదేశంపై దాడి చేసినట్లు చెప్పుకొచ్చారు.

# సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

## పలువురుకి ఘనంగా సత్కారాలు







రామచంద్రపురం, ఏప్రిల్ 24( శ్రీచక్ర)రామచంద్రపురం మండలం హసన్ గ్రామంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ శాఖ వారి ఆదేశానుసారం సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, హసన్ బాద చేనేత శ్రామికుల నాయకులు దొంతంశెట్టి సత్య ప్రకాష్ గాంధీ- అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.హసన్ బాద గ్రామ పంచాయతీ కార్యదర్శి కాశి రాకేష్ కుమార్ సభ నిర్వహిస్తూ పంచాయతీ రాజ్ దినోత్సవం గురించి గ్రామస్థులకు వివరించారు.ఇటీవల శ్రీనగర్ లో ఉగ్రవాదుల చేతిలో దుర్మరణం పొందిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఒక్క నిమిషం మౌనం పాటించారు.హసన్ బాద గ్రామానికి సర్పంచ్ గా ఎన్నికై గ్రామానికి విశిష్ఠ సేవలందించిన గ్రామ మాజీ సర్పంచ్ లు అల్లక సుందరరావు, కొండా అమ్మాజీ, గొల్లపల్లి పార్వతి తదితరులను ప్రస్తుత సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, గ్రామ పెద్దలు చింతపల్లి వీరభద్రరావు వారిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ సర్పంచ్లను సత్కరించడం అభినందనీయమని,ప్రతీ గ్రామ పౌరుడు కూడా పారిశుద్ధ్యం పట్ల బాధ్యతగా ఉండి మన ఇంటినీ మన ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు తెలియజేసారు.సర్పంచ్ మాట్లాడుతూ మన గ్రామానికి విశిష్ట సేవలందించిన మాజీ సర్పంచ్ల సేవలను కొనియాడుతూ వారిని సత్కరించుకోవడం సమంజసనీయమనీ బావించి వారిని గౌరవించడం జరిగిందని తెలిపారు. దొంతంశెట్టి సత్య ప్రకాష్ మాట్లాడుతూ మన గ్రామ సర్పంచ్ ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటారని వారిని కొనియాడారు.గ్రామ సభలో గ్రామ సమస్యలపై చర్చించారు.అనంతరం హసన్ బాద జెడ్ పి పి ఎచ్ స్కూల్ టెన్త్ క్లాస్ లో 574 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చిన చోడిశెట్టి నాగ విజయ మహేశ్వరి,571మార్కులతో స్కూల్ సెకండ్ వచ్చిన దాకే ఆకాంక్ష 565 మార్కులతో స్కూల్ థర్డ్ వచ్చిన సూరంపూడి దిలీప్ తదితర విద్యార్డులను అభినందిస్తూ సర్పంచ్ వారిని సత్కరించారు.గ్రామానికి 12 సంవత్సరములుగా పారిశుధ్య సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులు రెడ్డిను సర్పంచ్ సత్కరించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు,గ్రామ పెద్దలు చోడిశెట్టి భద్రరావు,బొల్లం సత్తిరాజు, వి ఆర్ ఓ నరహరశెట్టి సత్తిబాబు, సచివాలయం ఇతర శాఖల సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ వెన్నులో వణుకు..!

### భారత్ సర్జికల్ స్ట్రయిక్స్ చేస్తుందేమోనని మిస్సైల్స్ టెస్ట్‌కు ఆదేశాలు..!

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌పై భారత్ కఠిన చర్యలకు ఉప్రకమించింది. అయితే, దాడి ఘటన తర్వాత భారత్ ఎలాంటి చర్యలు తీసుకుబోతోందని పాకిస్తాన్ భయాందోళనకు గురవుతున్నది. ఈ క్రమంలో ఈ నెల 24-25 తేదీల్లో జరిగిన ఎకనామిక్ జోన్‌లో కరాచీ తీరంలో ఉపరితలం నుంచి ఉపరితలం వరకు లక్ష్యాలను ఛేదించే క్షిపణులను పరీక్షించేందుకు పాకిస్తాన్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, పరిణామాలన్నింటిని భారతీయ ఏజెన్సీలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. గతంలో ఉగ్రవాదులు దాడులకు ఆత్మాహుతికి పాల్పడడంతో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందిన విషయం తెలిసిందే. ఆ ఘటన తర్వాత పాకిస్తాన్‌పై భారత్ సైర్జికల్ స్ట్రయిక్స్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మళ్లీ భారత ఎలాంటి దాడులు చేస్తుందోనని పాకిస్తాన్ ఆందోళనకు గురవుతున్నారు.పహల్గాం దాడి తర్వాత పాకిస్తాన్‌పై భారత్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సింధు జలాల ఒప్పందం రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆ దేశంపై ఆందోళన మరింత పెరిగింది. భారత్ దాడి చేస్తుందని పాకిస్తాన్ భావిస్తున్నది. ఇందులో



భాగంగానే మిస్సైల్స్‌ని పరీక్షిస్తుంది. పాకిస్తాన్ వైమానిక దళం, నావికదళానికి నోటీసులు జారీ చేసింది. ఏదైనా దాడి జరిగితే ప్రతిస్పందించాలని సైన్యాన్ని అప్రమత్తం చేసింది. పాకిస్తాన్ నేవీ విన్యాసాలు మొదలుపెట్టిందని భారత్‌లో రక్షణ, భద్రతా సంస్థల వర్గాలు తెలిపాయి. భారత కదలికలను పాక్ పరిశీలిస్తూ వస్తున్నది. పహల్గాం దాడి ఘటనకు పాల్పడిన వారితో పాటు వారి స్పాన్సర్లను జవాబుదారీగా చేస్తామని భారత్ స్పష్టం చేసింది. పాకిస్తాన్‌లో జరుగుతున్న కార్యకలాపాలను భారత ఏజెన్సీలు నిశితంగా గమనిస్తున్నాయి.పాకిస్తాన్ సైన్యం సన్నాహాలను పర్యవేక్షిస్తున్నారు. పహల్గాం దాడి తర్వాత భారతదేశంలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (అఅూ) సమావేశంలో ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు. పహల్గాం దాడితో పాకిస్తాన్ సంబంధాలపై చర్చించారు. పాకిస్తాన్ సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతును ఉపసంహరించుకునే వరకు.. 1960 నాటి సింధు జల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు కేంద్రం చర్యలు తీసుకున్నది. అయితే, భారత ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తక్షణం ప్రభావం చూపకపోయినా.. దీర్ఘకాలికంగా ఇబ్బందులుపడే అవకాశాలున్నాయి. అలాగే, అట్టారిలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ కూడా తక్షణమే మూసివేశారు. ఎస్ఏఏఆర్సీ వీసా మినహాయింపు పథకం (ూఎఇూ) కింద పాకిస్తాన్ జాతీయులను భారత్‌లో పర్యటించేందుకు అనుమతించరు. గతంలో పాక్ జాతీయులకు జారీ చేసిన వీసాలు రద్దయ్యాయి. వీసాలు రద్దయిన నేపత్యంలో భారత్‌ను విడిచి వెళ్లేందుకు 48 గంటల సమయం ఉంటుంది.

## కుంభమేళా తరహాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరగబోతుంది : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, తెలంగాణ ప్రజలకు శ్రీరామ రక్షగా నిలబడేది గులాబీ జెండా మాత్రమేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ బాగుండాలని బీఆర్ఎస్ నాయకులు కోరుకుంటారని.. కానీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాత్రం తమకు ఓట్లు బాగా రావాలని అనుకుంటున్నారని విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజల మధ్య చీలక తీసుకొచ్చి ఓట్లు పొందేందుకు ప్రయత్నాలు చేస్తుంటాయని మండిపడ్డారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాంగణాన్ని పార్టీ శ్రేణులతో కలిసి గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత పరిశీలించారు.కాంగ్రెస్‌ది చేతగాని ప్రభుత్వమని ప్రజలకు తెలిసిపోయిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో 16 పనులు కూడా కాలేదని విమర్శించారు. దేశానికే సేవలు అందించడానికి టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందామని వివరించారు. పరిణితి చెందడం ప్రకృతి ధర్మమని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారిందంటే అది ప్రజల కోరుకున్న రెవల్యూషన్ అని చెప్పారు. రజతోత్సవం ఎందుకు చేసుకుంటున్నారని కొంతమంది వెకిలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు అవాకులు, చెవాకులు, పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడే మాటలను ప్రజలు క్షమించరని చెప్పారు.బీఆర్ఎస్ పార్టీలోని మహిళా నాయకత్వాన్ని పటిష్టం చేయడానికి కేసీఆర్ రోడ్ మ్యాప్ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని చెప్పారు. తెలంగాణ అస్తిత్వం కోసం ఉద్యమాన్ని మొదలుపెట్టారని గుర్తుచేశారు. ఉద్యమం మొదలుపెట్టినప్పుడు ఉత్పన్నమైన అన్ని అనుమానాలను కేసీఆర్ పటాపంచలు చేశారన్నారు. ఒక రక్తం చుక్క కూడా చిందించకుండా రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కేసీఆర్ అని కొనియాడారు.



## భారత రాష్ట్ర సమితి రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

ములుగు ప్రతినిధి :ఈ నెల 27న జరగబోయే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు ఏటూరునాగారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట చలో వరంగల్ బి.ఆర్.ఎస్ పార్టీ 25 వ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్ ఏటూరునాగారం మండల అధ్యక్షులు గడదాను సునీల్ ఆవిష్కరించారు.అనంతరం ఏటూరునాగారం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో పాలకులంతా తెలంగాణను అన్ని రంగాల్లో అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరు కోలేక తనకున్న అన్ని పదవులకు రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 27.04.2001 తేదీన ఏర్పాటు చేసిన పార్టీయే బి ఆర్ ఎస్ పార్టీ అన్నారు. 14 సంవత్సరాల పోరాటం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 10 సంవత్సరాల తెలంగాణ సుభిక్ష పాలన చేసిన నాయకుడు, తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో ఈనెల 27 న ఎల్కతుర్తి క్రాస్ రోడ్డు వరంగల్ లో జరిగే 25 సంవత్సరాల రజతోత్సవ సభను విజయవంతం చేయుటకు సబండ వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, ఎండి ఖాజాపాషా,,గండపల్లి నర్సయ్య, మేరుగు వేంకటేష్, దొడ్డ కృష్ణ, తాడూరి రఘు,మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## భూ హక్కుల నమోదు ప్రక్రియ కోసం రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మం, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన భూభారతి చట్టం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.గురువారం నాడు కలెక్టర్ నేలకొండపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం సందర్శించారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ మండలం నేలకొండపల్లిలో రెవెన్యూ సదస్సుల నిర్వహణలో భాగంగా బుధవారం వరకు గ్రామాలలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల స్థితిగతులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు.ఇప్పటి వరకు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తు వివరాలు, ఏలాంటి భూ సమస్యలు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. భూ భారతి కొత్త చట్టం ప్రజల భూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ చట్టం అమలు పరిధిలో శాశ్వత పరిష్కారాలకు మార్గం సూచించారు. నేలకొండపల్లి మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. గత చట్టం కంటే కొత్త చట్టం లో మెరుగైన అంశాలు ఉన్నట్లు కలెక్టర్ అన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని గ్రామస్తుల ఆందోళన

చంద్రుగొండ, ఏప్రిల్ 24 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం గుర్రంగూడెం గ్రామ పంచాయతీలో అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారని, ఇందిరమ్మ ఇల్లు రావాలంటే రూ.50 వేలు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం గ్రామస్తులు, మహిళలు ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కొందరు రూ.50 వేలు ఇస్తేనే అర్హుల జాబితాలో తమ పేర్లు ఉంటాయని డిమాండ్ చేసి మరీ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనర్హులు 18 మందికి ఇందిరమ్మ ఇల్లు ఎలా ఇచ్చారని, దీనిపై ఉన్నతాధికారి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇల్లు వచ్చేవరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# ఏపీ బీజేపీ ఛీఫ్ కోసం పోటీ..

విజయవాడ , ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్ష పదవికి భారీ స్థాయిలో పోటీ నెలకొంది. కూటమి అధికారంలో ఉంది. కేంద్ర ప్రభుత్వంలోనూ ఏపీ ఇంపార్టెన్స్ పెరిగింది. అమరావతి, పోలవరం నిర్మాణాలకు ప్రాధాన్యత దక్కుతోంది. ఈ కారణాలతో ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి గతంలో కంటే ప్రాముఖ్యమైందిగా మారిపోయింది. అందుకే ఈసారి ఎన్నడూ లేనంతగా ఆ పదవి కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రంలో ,కేంద్రంలో తమకున్న పలుకుబడి దృష్ట్యా ఎవరికి వారు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు.ఇప్పటికే రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరికే మరోసారి ఆ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో బీజేపీ అధిష్టానం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. కేంద్రంలో కీలక పదవికి ఆమెను తీసుకు వెళ్లాలని భావించినా 2024 ఎన్నికల సమయంలో కీలకంగా ఆమె వ్యవహరించడం ఎన్టీఆర్ కుమార్తె అనే సెంటిమెంట్ ప్రజల్లో ఉండడం టిడిపి నేతలు, జన సైనికులు కూడా ఆమెతో గౌరవంగా ఉండడం పార్టీకి కలిసి వస్తుందని కేంద్ర స్థాయి నేతలు భావిస్తున్నారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేని పనితీరు మరోసారి కలిసి వచ్చే ఛాన్స్ ఉంది. ఇటీవలే ఆమె కుటుంబంతో నారా కుటుంబం కూడా కలిసిపోయిన పరిస్థితులు బేరీజు వేసుకుని పురందేశ్వరికే మరికొంత కాలం పార్టీ బాధ్యతలు అప్పజెప్పాలని కేంద్ర బీజేపీలోని ఒక వర్గం భావిస్తోంది.ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వ్యక్తుల్లో విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సత్యనారాయణ చౌదరి అలియాస్ సుజనాచౌదరి ఒకరు. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమి తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీలో చేరిన ఆయన అప్పటి నుంచి పార్టీకి నమ్మకంగా పని చేస్తూ వస్తున్నారు. ఆర్థికంగా సామాజికంగా బలమైన వ్యక్తి కావడంతోపాటు కేంద్ర స్థాయిలో పలుకుబడి కూడా గట్టిగానే ఉంది. 2024 ఎన్నికల్లో చాలా కీలకంగా వ్యవహరించిన ఆయనకు టిడిపి హైకమాండ్‌తో కూడా దగ్గర పరిచయాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇటీవల వైసీపీలో నుంచి బయటికి వచ్చిన ఒక కీలక నేత ఆ నిర్ణయం తీసుకునేలా చక్రం తిప్పింది సుజనా చౌదరే అని త్వరలోనే ఆ వ్యక్తి బిజెపిలో చేరతారని ఏపీ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ ప్రచారంలో వాస్తవం ఎంత ఉన్నా సుజనా చౌదరికి బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పజెప్పినట్లయితే పార్టీని బలోపేతం




చేసేలా కీలక వ్యక్తులను ప్రముఖులను పార్టీ వైపు ఆకర్షించేలా చేయగల సమర్థత సుజనా చౌదరికి ఉందని ఆయన వర్గం చెబుతూ వస్తోంది. సుజనా చౌదరి కూడా ఆ దిశగా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారన్న సంకేతాలు అందుతున్నాయిబిజెపి ఈసారి రాయలసీమనేతకు రాష్ట్ర అధ్యక్ష పదవి కట్ట పెట్టాలంటే అది దక్కేది విష్ణువర్ధన్ రెడ్డికే. ఇప్పటికే ఆ దిశగా తన ప్రయత్నాలు తీవ్రతరం చేశారాయన. యువనేత కావడం ప్రత్యర్థులకు సీరియస్‌గా సమాధానం చెప్పడం పార్టీకి విధేయుడుగా ఉండడం ఇవన్నీ ఆయనకి కలిసి వచ్చే అంశాలు కాగా.. కాస్త దూకుడు స్వభావం చిక్కులు తెచ్చి పెడుతూ ఉంటుంది. కానీ ఎలాగైనా బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం తన వంతు ప్రయత్నం ఆయన ముమ్మరంగా చేస్తున్నారు బీజేపీ కేంద్ర నాయకత్వం వద్ద అత్యంత పలుకుబడి గల వ్యక్తి. కేంద్ర విధానాలపైన రాష్ట్ర సమస్యలపైన లోతైన అవగాహన ఉన్న వ్యక్తి ఈయనే. 2024 ఎన్నికలకు ముందే ఏపీకి షిఫ్ట్ అయిన జీవీఎల్ నరసింహారావు కొంతకాలం పాటు వైజాగ్‌కు మాత్రమే పరిమితం అయిపోయారు. ఇప్పుడు మారిన పరిణామాల దృష్ట్యా రాష్ట్ర రాజకీయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించాలని భావిస్తున్నారు. పైపెచ్చు మొదటి నుంచి బిజేపీతోనూ సంఘ్ పరివార్‌తోనూ లోతైన సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తిగా జివిఎల్ బిజెపి కేంద్ర నాయకత్వం దృష్టిలో గుడ్ లుక్స్‌లో ఉన్నారు. బిజెపి రాష్ట్రంలో కష్టకాలంలో ఉన్న సమయంలోనూ నిబద్ధతతో పనిచేసిన వ్యక్తిగా మాధవ్‌కు గుర్తింపు ఉంది. గతంలో విపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్సీగా ప్రజా సమస్యలపై మాట్లాడిన అనుభవం ఉంది. వివాదరహితుడు కావడంతోపాటు ఉత్తరాంధ్రకు చెందిన నాయకుడిగా ఉన్న పేరు అందరితో కలిసిపోయే మనస్తత్వం మాధవ్‌కు ప్లస్ పాయింట్స్. మంచివాడు సమర్ధుడు అనే పేరు ఉన్నా మిగిలిన వారితో పోలిస్తే కేంద్ర నాయకత్వం దగ్గర రాష్ట్ర అధ్యక్షుడు పదవి కోసం ఆ స్థాయిలో లాబీయింగ్ చేయగలడా లేదా అనేది ఆధారపడి ఉంటుంది.ప్రధానంగా ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వ్యక్తులు వీరే. వీళ్ళే కాకుండా క్షత్రియ సామాజిక వర్గం నుంచి విష్ణుకుమార్ రాజు లాంటివాళ్ళు లైన్‌లోనే ఉన్నా ఆ సామాజిక వర్గానికి కేంద్రమంత్రి పదవి ఇచ్చారు. కాబట్టి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇస్తారా లేదా అనేది డౌటే. ఏదైనప్పటికీ గతంలో ఎన్నడూ లేనంతగా ఏపీ బీజేపీ అధ్యక్ష పదవి కోసం తీవ్రమైన పోటీ అయితే నెలకొని ఉంది. పైన చెప్పిన పేర్లలో ఒకరిని కేంద్ర అధినాయకత్వం గుర్తిస్తుందా లేక మరొక అనూహ్యమైన పేరును తెరపైకి తెస్తుందా అనేది చూడాలి.

## అలా అయితే ఎలా..తమ్ముళ్ల ఆవేదన

విజయవాడ, ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పార్టీ నేతలతో పాటు క్యాడర్ కూడా ఒకింత అసహనంతో ఉన్నారు. కూటమి ద్వారా అధికారంలోకి వచ్చినప్పటికీ రాజ్యసభ స్థానాల విషయంలో తలవొగ్గి ఉండటం ఎందుకన్న ప్రశ్న తలెత్తుతుంది. రాజ్యసభకు టీడీపీలో తక్కువ స్థానాలు ఉన్నప్పటికీ ఖాళీ అయ్యే ప్రతి స్థానం కమలం ఖాతాలో పడిపోతే ఇక మనకు వచ్చేది ఎప్పుడంటూ నేతలు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ క్యాడర్ ఇదే రకమైన ప్రశ్నలు వేస్తున్నారు. గత ఎన్నికల్లో కూటమి ఏర్పాటయినందున అనేక మంది తమ స్థానాలను త్యాగం చేశారు. అదేసమయంలో చాలా మంది సీనియర్లను పోటీకి దూరంగా పెట్టారు. అయితే వారి సేవలను వినియోగించుకుంటామని చెప్పడంతో ఎక్కువ మంది రాజ్యసభ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. టీడీపీలో చాలా మంది సీనియర్ నేతలు గత ఎన్నికల్లో టిక్కెట్లు దక్కకపోయినా కూటమి విజయం కోసం పనిచేశారు. తమకు సుదీర్ఘకాలంగా ఉన్న పరిచయాలను కూటమి అభ్యర్థుల గెలుపుకోసం ప్రయత్నించారు. అంతే కాదు.. నియోజకవర్గంలో తమ పట్టు కోల్పోతామని తెలిసినా పార్టీ కోసం వారు కష్టపడి పనిచేశారు. అనేక మంది కొత్త వారికి, యువకులకు అవకాశం ఇవ్వడంతో సీనియర్ నేతలకు టిక్కెట్లు దొరక్కుండా పోయాయి. అయినా అసంతృప్తి లోపల ఉన్నా ఎక్కడా బయటపడకుండా క్యాడర్ కు సర్దిచెప్పి ఎన్నికల్లో విజయం కోసం పాటుపడ్డారు. టీడీపీ అధికారంలోకి వస్తే తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని వారు నమ్మకం పెట్టుకున్నారు. అందుకే గత ఎన్నికల్లో కష్టపడి పనిచేశారు. గతంలో వైసీపీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసినా అందులో రెండింటిలో మాత్రమే టీడీపీ నిలబెట్టింది. రెండింటిలోనూ ఒకటి రాజీనామా చేసి వచ్చిన బీద రవిచంద్ర యాదవ్ కు తిరిగి పదవి ఇచ్చింది. అలాగే మరో రాజ్యసభ పదవి యువకుడైన సానా సతీష్ కు ఇచ్చారు. దీంతో నాడు కూడా సీనియర్ నేతలు పెట్టుకున్న ఆశలు అడియాసలు అయ్యాయి. పార్టీ అధికారంలో లేనప్పుడు తాము కష్టించి పనిచేసినా తమ కష్టాన్ని పార్టీ నాయకత్వం గుర్తించలేదన్న అసహనం కొందరు వ్యక్తంచేశారు. పెద్దల సభలో పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన సమయంలో ఇలా ఒత్తిడులకు తలొగ్గి బీజేపీకి అన్నిస్థానాలను కట్టబెట్టడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. కేవలం అమారావతి, పోలవరం నిర్మాణం కోసం పదవులను పణంగా పెట్టడం ఎంత వరకూ సబబని కొందరు సూటిగానే ప్రశ్నిస్తున్నారు. బీజేపీకి ఏపీలో ఉన్న బలం తక్కువేనని తెలిసినా అది అడిగిన వెంటనే ఒప్పుకుని సొంత పార్టీ నేతలను రాజకీయంగా దూరం పెట్టేందుకు పార్టీ అగ్రనాయకత్వం చేస్తున్న పనిని పలువురు తప్పుపడుతున్నారు. ఏపీనుంచి కాకుండా తమిళనాడుకు చెందినవారికి రాజ్యసభ పదవి ఇస్తే ఏ రకమైన సంకేతాలు వెళతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మన అవసరం వాళ్లకు ఉందని, దానిని ఆలోచించి పదవుల విషయంలో త్యాగరాజులు కావద్దన్నసూచనలు వెలువడుతున్నాయి.

## ఒంగోలులో బైక్ ట్రాక్టర్

ఒంగోలు, ఏప్రిల్ 24,మనిషి తలుచుకుంటే సాధ్యం కానిది ఏది లేదంటారు. మానవ మెదడే అతి పెద్ద అద్భుతం.. మరి దానికి కాస్త పదును పెడితే.. అది సృష్టించే విజయాలు ఎన్నో. చరిత్ర సృష్టించాలంటే.. పెద్ద పెద్ద కాలేజీల్లో.. గొప్ప గొప్ప చదువులు చదవాల్సిన అవసరం లేదు. కాస్త బుర్రకు పదును పెడితే.. ఎన్నో అద్భుతాలు చేయవచ్చు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే బైక్ మెకానిక్ కూడా ఇలానే ఆలోచించి.. అద్భుతం చేశాడు. చిన్న ఆలోచనతో లక్షల రూపాయల ఖర్చు చేయాల్సిన అవసరాన్ని అధిగమించాడు. ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటే ఎడ్లు కచ్చితంగా ఉండాల్సిందే. ఇప్పుడైతే ట్రాక్టర్ తప్పనిసరి అయ్యింది. మరి చిన్న, సన్నకారు రైతులు లక్షల రూపాయలు ఖర్చు చేసి ట్రాక్టర్ కొనాలంటే కష్టం. ఆ సమస్యను సదరు రైతు మెకానిక్ పరిష్కరించాడు.ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం, ఎడ్లూరిపాడుకు చెందిన హజ్రత్ వలి అనే బైక్ మెకానిక్ కాస్త వినూత్నంగా ఆలోచించి.. ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్‌గా పనిచేసేలా మార్చి.. రైతులకు మేలు చేశాడు. వలి కనిపెట్టిన ఈ పరికరం ద్వారా.. రైతులు వ్యవసాయ పనులు చక్కబెట్టుకోవచ్చు. దీని తయారికి గాను వలికి అవసరమైన మొత్తం కేవలం 20 వేల రూపాయలు మాత్రమే.బైక్‌ను ట్రాక్టర్‌గా మార్చాలని భావించిన వలి.. ముందుగా తన ద్విచక్ర వాహనం టైర్లను తొలగించి.. వాటి స్థానంలో బురదలో దిగబడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా తయారుచేసిన బలమైన బటన్ చక్రాలను అమర్చాడు.

## ఏప్రిల్ 28న విశాఖ మేయర్ ఎన్నిక

విశాఖపట్టణం, ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అధికారం కోల్పోయిన తర్వాత పలువురు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు వైసీపీని వీడుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లోకి జంప్ అవుతూ ఉండటంతో ఇప్పటికే పలు కార్పొరేషన్లను, మున్సిపాలిటీలను వైసీపీ కోల్పోయింది. తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో వైసీపీకి షాక్ తగిలింది. సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీ వైసీపీ చేజారింది. కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నిసాపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో కదిరి మున్సిపాలిటీని కూడా వైసీపీ కోల్పోయింది. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి 25మంది కౌన్సిలర్లు హాజరు కాగా.. ఛైర్ పర్సన్‌తో పాటు వైసీపీ 11మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కోరం ఉండటం... హాజరైన మొత్తం 25మంది అవిశ్వాసానికి మద్దతివ్వడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కదిరి మున్సిపల్ ఆఫీసు వద్ద పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.మరోవైపు కదిరి మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం నెగ్గటంతో టీడీపీ శ్రేణులు టపాసులు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. ప్రజాస్వామ్యయుతంగానే అవిశ్వాసం జరిగిందన్నారు. కదిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ నజీమున్నిసా అవినీతికి పాల్పడ్డారని.. కదిరిలో అభివృద్ధి లేదని ఆరోపించారు. అందుకే వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారన్న కందికుంట వెంకటప్రసాద్.. కదిరి అభివృద్ధి కోసమే అవిశ్వాసం పెట్టినట్లు తెలిపారు. త్వరలో అందరికీ ఆమోదకరంగా ఉండేలా మున్సిపల్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్‌ను ఎన్నుకుంటామని వెల్లడించారు.మరోవైపు విశాఖపట్నం మేయర్ పీఠం వైసీపీ చేజారిన సంగతి తెలిసిందే. విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం ఇటీవల నెగ్గింది. దీంతో హరి వెంకట కుమారిని మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని అందులో పేర్కొంది. విశాఖ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి 2/3 వంతు సభ్యులు అనుకూలంగా ఓటు వేయటంతో తీర్మానం నెగ్గింది. 110 మంది సభ్యుల్లో 74 మంది తీర్మానానికి మద్దతుగా ఓటేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గగా.. విశాఖ మేయర్ పదవి నుంచి హరి వెంకట కుమారిని తొలగిస్తూ ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోవైపు విశాఖ మేయర్ పదవికి ఏప్రిల్ 28న ఎన్నిక నిర్వహించనున్నారు.

## నాటకాల రాయుడికి చెక్...

శ్రీకాకుళం, ఏప్రిల్ 24, వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను ఆ పార్టీ నాయకత్వం సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ నాయకత్వం దువ్వాడ శ్రీనివాస్ ను సస్పెండ్ చేస్తున్నట్లు వైసీపీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు రావడంతో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అర్థమవుతుంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు దువ్వాడపై వరసగా ఫిర్యాదులు రావడంతోనే శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసినట్లు ప్రకటనలో తెలిపింది. అయితే ఇది ఒక నాటకంగా ప్రత్యర్థి పార్టీలు చెబుతున్నాయి. ఎప్పుడో తీసుకోవాల్సిన నిర్ణయం ఇప్పుడు తీసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయడమే కాకుండా ఎమ్మెల్సీ పదవి నుంచి కూడా దువ్వాడను తప్పిస్తేనే జనం నమ్ముతారంటున్నారు.. గతంలోనూ ఎమ్మెల్సీ అనంతబాబు విషయంలోనూ ఇదే జరిగిందన్న విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య ఘటనలో నాడు అనంతబాబు జైలుకు వెళ్లారు. నిందితుడిగా చేర్చిన పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. దళిత వ్యక్తిని చంపడమే కాకుండా తన కారులోనే పార్శిల్ చేసి ఇంటికి తీసుకు వచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన వైనం అప్పట్లోనే సంచలనం కలిగించింది. అయితే అనంతబాబుపై పార్టీ పరంగా చర్యలు తీసుకున్న వైసీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీ పదవి నుంచి మాత్రం వేటు వేయలేకపోయింది. అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆ పనిచేయకపోవడంతో ఆ ఘటన పార్టీ ఓటమికి ఒక కారణంగా మారిందనే చెప్పాలి.ఇక దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం కొత్తగా జరగట్లేదు. గత కొన్ని నెలలుగా జరుగుతున్న తంతు ఇది. దాదాపు ఏడాది కాలం నుంచి ఈ డ్రామా నడుస్తుంది.దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు ఆయన ఇంటివద్ద ఆందోళనకు దిగారు. .దువ్వాడ శ్రీనివాస్ తో వాణి వివాహమయింది. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు.



అయితే గత కొంత కాలం నుంచి ఇద్దరూ విడిపోయి ఉంటున్నారు. దువ్వాడ శ్రీనివాస్ గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అంతకు ముందు శ్రీకాకుళం పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేశారు. ఓటమి పాలు కావడంతో ఆయనకు వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. తర్వాత 2024 ఎన్నికల్లో టెక్కలి సీటును కూడా దువ్వాడ శ్రీనివాస్ కే జగన్ కేటాయించారు. దీంతో పాటు మాధురి అనే మహిళతో బయట చక్కెర్లు కొడుతున్నారు. అయినా సరే ఇప్పటి వరకూ పార్టీ చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దువ్వాడ శ్రీనివాస్ ఫ్యామిలీలో రచ్చ మొదలయింది. ఇది టెక్కలిలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రచ్చ అయింది. పార్టీకి కూడా తలనొప్పిగా మారింది. ఒక ఎమ్మెల్సీగా ఉండి భార్యకు విడాకులు ఇవ్వకుండా దువ్వాడ శ్రీనివాస్ మరో మహిళతో సహజీవనం చేస్తున్నారని ఆయన భార్య వాణి ఆరోపిస్తున్నారు. ఆమె ట్రాప్ లో పడి తమను పూర్తిగా వదిలేశారంటున్నారు. గత కొంతకాలంగా దువ్వాడ శ్రీనివాస్, మాధురి కలసి టూర్లు చేస్తున్నారు. అయినా పార్టీ పట్టించుకోలేదు. తిరుమలలోనూ ఫొటో షూట్ వివాదంగా మారింది. అయినా చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు తాజాగా ఆయనపై సస్పెన్షన్ వేట వేయడం డ్రామాగానే చూడాల్సివస్తుందని, పార్టీకి ఉత్తరాంధ్రలో జరుగుతున్న డ్యామేజీని కాపాడుకోవడానికే ఇప్పుడు సస్పెన్షన్ వేటు వేశారంటూ కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. అందులో నిజం కూడా ఉంది కదా?

## పెరుగుతున్న బంగారం ధరతో...స్వర్ణకారుల అవస్థలు



రాజమండ్రి , ఏప్రిల్ 24, బంగారం ధర లక్ష రూపాయలు దాటేసింది. పది గ్రాముల పసిడి త్వరలో లక్షా పాతికకు వెళ్తుందని అంచనా. బంగారం ధర ఆకాశాన్నంటుండటంతో మధ్యతరగతి ప్రజలు బంగారు వైపు చూసేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా బంగారు వస్తువులు చేయించుకోవడానికి గోల్డ్ స్మిత్ వర్కర్స్ దగ్గరికి రావడం మానేశారు. దీంతో ఉన్న వ్యాపారం పోయి గోల్డ్ స్మిత్ వర్కర్లు డీలాపడ్డారు. ప్రస్తుతం తమ పరిస్థితి దయనీయంగా ఉందంటున్నారు స్వర్ణకారులు.స్వర్ణకారులు సాధారణంగా బంగారం, వెండి తోపాటు ప్లాటినం వంటి లోహాలను ఉపయోగించి ఆభరణాలు, ఇతర అలంకరణ వస్తువులను డిజైన్ చేయడం, క్రాఫ్టింగ్ చేయడం, మరమ్మతు చేయడం, సవరించడం వంటి పనులను చేపడతారు. ఒక బంగారు వస్తువు తయారు చేయాలన్నా.. వస్తువు రీప్లేస్‌మెంట్ చేయాలన్న చాలా నిశిత దృష్టి అవసరం. అలాంటి స్వర్ణకారుడు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి మెయిన్ రోడ్ లో 700కి పైగా బంగారు షాపులు ఉన్నాయి. ఇందులో వందలాది మంది స్వర్ణకారులు పనులు చేసుకుంటున్నారు.తాజాగా పెరిగిన బంగారం ధరలతో బంగారం కొనుగోలు చేయలేక మధ్యతరగతి వారు కూడా కనీసం షాపులకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే మమ్మలను ఆదుకోవాలని కోరుతున్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలు బంగారు ఆభరణాలు తయారు చేయడానికి తమ వద్దకు రాక పనులు లేక స్వర్ణకారులు షాపులు వెలవెలబోతున్నాయి. స్వర్ణకారుల షాపుల వద్ద పనులు లేక కొన్ని షాపులు మూసేస్తే మరికొన్ని షాపుల వద్ద ఖాళీగా పనిలేక నిరాశతో ఉన్నారు.బంగారు ధరల పెరుగుదలను పరిగణనలోకి తీసుకుంటే ప్రజలు మునుపటి కంటే తక్కువ బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు. తత్ఫలితంగా, స్వర్ణకారులు ప్రతికూలంగా ప్రభావితమవుతున్నాయి అంటున్నారు. చాలా మంది చేతి వృత్తులవారి జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని, ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ స్వర్ణకారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల్లో స్వర్ణకారులకు లోన్లు రాక.. ఇటు పనులు లేక కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారని వాపోతున్నారు. బంగారం ధర పెరుగుదలతోపాటు.. పెద్ద పెద్ద లగ్జరీష్ బంగారం షాపులు వచ్చేయడంతో పనులు బాగా తగ్గిపోయిని వాపోతున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని ఏదైనా భృతి ప్రకటించాలని కోరుతున్నారు రాజమండ్రి స్వర్ణకారులు.తూర్పుగోదావరి జిల్లాలో ఒక రాజమండ్రిలోనే వెయ్యి మందికి పైగా స్వర్ణకారులు ఈ సాంప్రదాయ వృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఇక చుట్టుపక్కల స్వర్ణకారులైతే మరొక 3,000 నుంచి 4,000 మంది వరకు ఉంటారు. పూర్వపు ఉమ్మడి గోదావరి జిల్లాలో దాదాపు వేలాది మంది స్వర్ణకారులు పరిస్థితి ఇలాగే ఉందని అంటున్నారు. ఆభరణాల తయారీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రావడంతో ఈ వృత్తికి ప్రాధాన్యత తగ్గడం.. మరోవైపు బంగారు ఆభరణాలు రేటు అధికమవడం.. వెరసి సామాన్య స్వర్ణకారుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

## ఏపీలో మండుతున్న సూరీడు




కర్నూలు, ఏప్రిల్ 24, ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు దంచికొడుతున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఈ సీజన్‌లో ఎన్నడూ లేని స్థాయిలో నంద్యాల జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికమని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.వైఎస్సార్ జిల్లాలో 28, నంద్యాల 22, ప్రకాశం జిల్లాలో 17, పల్నాడు 14, కర్నూలు జిల్లాలోని పదిచోట్ల 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్‌లోని 30 మండలాల్లో తీవ్రవడగాలులు, 29 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉండటం, ఎండవేడిమి నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ సూచించారు.ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు పైగా నమోదవుతున్న నేపథ్యంలో వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు. రోజువారీ పనుల కోసం బయట తిరిగే వారు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాలుల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిమ్మరసం, పండ్లరసాలు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలని చెప్తున్నారు. వేసవి సీజన్‌లో దొరికే పుచ్చకాయ, కర్బూజా వంటి పండ్లతో పాటుగా కీరదోస, బత్తాయి, ద్రాక్ష, పైనాపిల్ ఎక్కువగా తీసుకోవాలని చెప్తున్నారు. వీటిలో నీటిశాతం అధికంగా ఉంటుందని.. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడతాయని వివరిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదని.. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి ధరించాలని సూచిస్తున్నారు.వడదెబ్బ ఎవరికి తగులుతుందంటే..ఎండాకాలంలో వడదెబ్బ ఫలానా వయసు వారికే తగులుతుందని చెప్పడానికి వీలులేదు.ఎవరికైనా తగలవచ్చు.




# పహల్గాం ఉగ్రదాడితో సంబంధం లేకపోతే ఎందుకు ఖండించలేదు..!



## పాక్ పీఎంను ప్రశ్నించిన డానిష్ కనేరియా..!

పహల్గాంలో జరిగిన ఇద్దరు విదేశీయులు సహా 26 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, దాడిపై పాక్ దౌత్యవేత్తలు, క్రికెటర్లు సైతం స్పందించలేదు. కానీ, పాకిస్తాన్ మాజీ లెగ్ స్పిన్నర్ డానిష్ కనేరియా మాత్రం సొంత దేశ ప్రధాని షాబాజ్ షరీఫ్‌ను ప్రశ్నించాడు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో పాకిస్తాన్‌కు సంబంధం లేకపోతే.. షాబాజ్ ఇప్పటివరకు ఎందుకు ఖండించలేదని నిలదీశారు. పహల్గాం ఉగ్రవాద దాడిలో పాక్ పాత్ర లేకపోతే షెహబాజ్ షరీఫ్ ఇంకా దానిపై ఎందుకు స్పందించలేదు? అకస్మాత్తుగా సైన్యాన్ని ఎందుకు అప్రమత్తంగా ఉంచారు? ఎందుకంటే నిజం ఏమిటో మీకు తెలుసు. మీరు ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ మద్దతు ఇస్తున్నారు. మీరు సిగ్గుపడాలి' డానిష్ కనేరియా ఘాటుగా స్పందించాడు.కనేరియా ట్వీట్‌పై ఓ నెటిజన్ స్పందించాడు. 'పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని భారతదేశం స్పాన్సర్ చేస్తోంది. బహుశా భారత రా బృందం కర్మ నుంచి పాఠం నేర్చుకోవచ్చు' అంటూ కామెంట్ చేశాడు. దీనికి కనేరియా బదులిస్తూ 'బలూచ్ ప్రజల బాధలకు కారణమైన వారి పక్షాన నిలబడటానికి మీరు సిగ్గుపడాలి. భారతదేశంపై తప్పుడు ఆరోపణలు వ్యాప్తి చేయడానికి మీరు సిగ్గుపడాలి. మీరు సమాజ విలువలకు ప్రాతినిధ్యం వహించరు. ఏ రూపంలోనైనా ఉగ్రవాదాన్ని సమర్థించడం అవమానకరమైనది' అంటూ బదులిచారు. మరో ట్వీట్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు స్థానిక కశ్మీరీలను ఎందుకు టార్గెట్ చేయరని ప్రశ్నించాడు. హిందువులే లక్ష్యంగా ఎందుకు దాడులకు తెగబడతారని మండిపడ్డాడు. ఉగ్రవాదం కారణంగా యావత్ ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించాడు.మరో ట్వీట్‌లో తాను ఏదైనా ట్వీట్ చేసినప్పుడల్లా కొందరు భారతీయ ముస్లింలు ఎందుకు బాధపడతారని నిలదీశాడు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, సెనేటర్ బిల్ హాగెర్టీ ట్వీట్‌లను రీట్వీట్ చేశారు. అయితే, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా మాజీ లెగ్ స్పిన్నర్ పోస్టులు పెట్టడంపై ఓ నెటిజన్ ప్రశ్నలు సంధించాడు. 'మీరు ఎక్కడి నుంచి వచ్చారో నాకు అర్థం కాలేదు. పాక్ తరఫున ఆడుతారు. పాక్ క్రికెట్ ద్వారా పేరు సంపాదించాడు. ఇప్పుడు ఆ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. సిగ్గుపడాలి' అంటూ కామెంట్ చేయగా.. దీనికి కనేరియా సైతం గట్టిగానే బదులిచ్చాడు. తాను పాకిస్తాన్ లేదంటే.. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడడం లేదని క్లారిటీ ఇచ్చాడు.పాక్ ప్రజలు సైతం ఉగ్రవాదంతో నష్టపోతున్నారని, శాంతి కోసం నిలబడే వారే నాయకత్వానికి అర్హులని.. అయామక ప్రజలు ప్రాణాలు కోల్పోయినప్పుడు మౌనంగా ఉండే వారు కాదు. ఒకప్పుడు గర్వంగా పాక్ జెర్సీ ధరించాను. క్రికెట్ మైదానంలో నా చెమటను, రక్తాన్ని చిందించాను. కానీ, చివరికి నన్ను పహల్గామ్ దాడి బాధితుల నుంచి భిన్నంగా చూడలేదు. హిందువుగా ఉన్నందుకు మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారు. ఉగ్రవాదాన్ని సమర్థించే వారు, హంతకులను రక్షించే వారు సిగ్గు సిగ్గు. నేను సత్యానికి అండగా నిలుస్తాను. నేను మానవత్వానికి అండగా నిలుస్తాను' అంటూ కనేరియా స్పందించాడు.డానిష్ కనేరియా తరఫున క్రికెట్ ఆడిన రెండో హిందు ఆటగాడు. గతంలో అతని కజిన్ అనిల్ దల్పత్ సైతం పాక్ తరఫున బరిలోకి దిగాడు. కనేరియా 2000-2019 మధ్యలో పాక్ తరఫున 61 టెస్టులు ఆడి 261 వికెట్లు తీశాడు. 18 వన్డేల్లో 15 వికెట్లు పడగొట్టాడు. కనేరియా హిందువు అన్న కారణం చేత పాక్ క్రికెట్‌లో ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. జట్టులో కనేరియా ఉండడం చాలా మంది క్రికెటర్లకు నచ్చేది కాదు. ఈ విషయాన్ని పాక్ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ స్వయంగా తెలిపాడు. కనేరియా స్పాట్ ఫిక్సింగ్ కేసులో జీవిత కాలం నిషేధం విధించారు. ప్రస్తుతం పాక్, ఆ దేశ క్రికెట్ బోర్డుతో విభేదాల నేపథ్యంలో ఆ దేశాన్ని విడిచిపెట్టి యూకేలో ఉంటున్నాడు.

# అంపైర్ డబ్బులు తీసుకున్నాడు కదా!

ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచులో ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్ ఇషాన్ కిషన్.. అంపైర్ ఔట్ ఇవ్వకపోయినా తనంతట తానే మైదానాన్ని వీడటం ప్రస్తుతం భారత క్రికెట్‌లో, ఫ్యాన్స్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్.. ఇషాన్ కిషన్ పెవిలియన్‌కు చేరిన తీరుపై కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇషాన్ పై దారుణంగా విమర్శలు చేశాడు. ప్రస్తుతం ఇషాన్ ఔట్ అంశంతో పాటు సెహ్వాగ్ అన్న వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. ఇంతకీ సెహ్వాగ్ ఏం అన్నాడంటే?ఐపీఎల్ 2025లో 41వ మ్యాచులో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ ముంబై ఇండియన్స్ తలపడ్డాయి. ఈ మ్యాచులో సన్‌రైజర్స్ మొదట బ్యాటింగ్ చేసింది. అప్పుడు హెడ్ ఔటయ్యాక.. మూడో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన



ఇషాన్ కిషన్ దీపక్ చాహర్ వేసిన ఇన్నింగ్స్ 3వ ఓవర్ తొలి బంతిని లెగ్ సైడ్ దిశగా ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బంతి ఇషాన్ బ్యాట్‌ను మిస్సై వికెట్ కీపర్ రికెల్టన్ చేతికి వెళ్లింది.అయితే బంతికి బ్యాట్‌కు తాకిందని భావించిన ఇషాన్ అంపైర్ ఎలాంటి ప్రకటన ఇవ్వకపోయినా.. పెవిలియన్ బాట పట్టాడు. రీ ప్లేలో బంతి బ్యాట్‌కు గానీ శరీరానికి కానీ తగల్లేదని తేలింది. దీంతో పెవిలియన్ చేరిన ఇషాన్ ను చూసి అంపైర్ ఔట్ ఇచ్చాడు. దీంతో ఇషాన్ ఔట్ తీరు.. తీవ్ర చర్చలకు దారీ తీసింది. ఇషాన్ మ్యాచ్ ఫిక్సింగ్ కు పాల్పడ్డాడని అంతా ఆరోపణలు చేస్తున్నారు. ముంబై ఇండియన్స్ నుంచి డబ్బు తీసుకున్నాడని అంతా అంటున్నారు.ఈ క్రమంలోనే వీరేంద్ర సెహ్వాగ్ కూడా కీలక కామెంట్స్ చేశాడు. కనీసం అంపైర్ నిర్ణయం ప్రకటించే వరకు అయినా, ఇషాన్ క్రీజును వదలకుండా ఉండాల్సింది, అతడు అనవసరంగా తొందరపడి క్రీజును వీడాడని పేర్కొన్నాడు. "అలాంటి సమయంలో చాలా సార్లు మెదడు పని చేయదు. ఇది బ్రెయిన్ ఫేడ్. కనీసం అంపైర్ నిర్ణయం ఏంటనేది తెలుసుకునేవరకు అయినా ఆగాల్సింది నాకు అస్సలు అర్థం కాలేదు. ఇషాన్ కిషన్ స్పోర్ట్స్‌మాన్‌షిప్ కోణంలో తానే ఔటైనట్టు భావించి వెళ్లిపోయాడని అనుకుందాం. కానీ అది ఔట్ కాదు. అదే సమయంలో అంపైర్ కూడా అతడు ఔట్ అయ్యాడా లేదా అన్న సందేహంలో ఉన్నాడు. పైగా ఇషాన్ కూడా సడెన్ గా మైదానాన్ని వదిలి వెళ్లిపోవడం ఎంతో అయోమయంగా అనిపించింది." అని సెహ్వాగ్ అన్నాడు.


# అవకాశం వస్తే పీఎస్ఎల్‌ను వదిలేసి ఐపీఎల్‌లో ఆడతా: పాక్ క్రికెటర్

పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ చేసిన ప్రకటన పాకిస్థాన్ క్రికెట్ అభిమానులకు నచ్చకపోవచ్చు. ఐపీఎల్‌లో ఆడే అవకాశం వస్తే ఈ లీగ్‌లో కచ్చితంగా పాల్గొనాలని కోరుకుంటున్నానని ఆమిర్ చెప్పాడు. తాను మొదట ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు ఎంపికైతే పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను విస్మరిస్తానని కూడా ఆమిర్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ లో ఆడాలనే కోరికను ఆమిర్ ఇప్పటికే వ్యక్తం చేశాడు.పాకిస్థాన్ న్యూస్ ఛానల్ జియోతో




మహమ్మద్ ఆమిర్ మాట్లాడుతూ .."నిజాయితీగా చెప్పాలంటే నాకు ఆడే అవకాశం వస్తే నేను ఖచ్చితంగా ఐపీఎల్‌లో ఆడతాను. నేను ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను. నాకు అవకాశం రాకపోతే నేను పీఎస్ఎల్‌లో మాత్రమే ఆడతాను. వచ్చే ఏడాది నాటికి నాకు ఐపీఎల్‌లో ఆడే అవకాశం వస్తే నేను ఎందుకు ఆడను? నేను ఖచ్చితంగా ఐపీఎల్‌లో పాల్గొంటాను. వచ్చే ఏడాది ఐపీఎల్, పీఎస్ఎల్ షెడ్యూళ్ల మధ్య ఘర్షణ ఉంటుందని నేను అనుకోను." అని మహమ్మద్ ఆమిర్ చెప్పుకొచ్చాడు. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఆమిర్ ఐపీఎల్ ఆడాలనే కోరికను వ్యక్తం చేశాడు.మాజీ ఫాస్ట్ బౌలర్ ఇంకా మాట్లాడుతూ.. "నేను పీఎస్ఎల్‌లో ముందుగా ఎంపికైతే.. నేను దాని నుంచి నా పేరును ఉపసంహరించుకోలేను. ఎందుకంటే అప్పుడు నేను టోర్నమెంట్ లో ఆడవలసి ఉంటుంది. నేను ఐపీఎల్‌లో ముందుగా ఎంపికైతే ఆ లీగ్ నుంచి కూడా నా పేరును ఉపసంహరించుకోను. ఇప్పుడు నేను ముందుగా ఎంపిక చేయబడిన లీగ్ పై ఆధారపడి ఉంటుంది. ఐపీఎల్ వేలం ముందుగా జరిగి నన్ను కొనుగోలు చేస్తే నేను పీఎస్ఎల్‌లో ఆడను. పాకిస్థాన్ సూపర్ లీగ్ డ్రాఫ్ట్ ముందుగా జరిగి నేను ఎంపికైతే ఈ టోర్నమెంట్ నుంచి నా పేరును ఉపసంహరించుకోలేను." అని అన్నాడు.


# టీమ్ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు చంపుతామంటూ బెదిరింపులు



న్యూఢిల్లీ: టీమ్ఇండియా ప్రధాన కోచ్, బీజేపీ మాజీ ఎంపీ గౌతమ్ గంభీర్‌కు బెదిరింపులు వచ్చాయి. తనను చంపుతామంటూ ఐసిస్ కశ్మీర్ నుంచి రెండు మెయిల్స్ వచ్చాయని ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతోపాటు కుటుంబ సభ్యులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ నెల 22న గంభీర్‌కు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఒక మంగళవారం మధ్యాహ్నం రాగా, మరొకటి అదేరోజు సాయంత్రం వచ్చింది. రెండిటిలోనూ ఐ కిల్ యూ అని ఉంది. ఈ నేపథ్యంలో కేసు నమోదుచేసిన ఢిల్లీలోని రాజింద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.గంభీర్‌కు ఇలాంటి బెదింపులు రావడం ఇది మొదటిసారి కాదు. 2021, నవంబర్‌లో ఆయన ఎంపీగా ఉన్న సమయంలో కూడా ఇలాంటి ఈ-మెయిల్ వచ్చింది. కాగా, మంగళవారం పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిని గంభీర్ ఎక్స్‌వేదికగా ఖండించారు. ఈ దాడిలో ఇప్పటివరకు 26 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

# ఆ ఇద్దరిపై వేటు..సీఎస్‌కేతో తలపడే సన్‌రైజర్స్ హైదరాబాద్ తుది జట్టు ఇదే!





ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో ఆసక్తికరపోరుకు సిద్ధమైంది. ముంబై ఇండియన్స్‌తో బుధవారం ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ ముగిసిన 48 గంటల వ్యవధిలోనే ఆరెంజ్ ఆర్మీ మరో మ్యాచ్ ఆడేందుకు రెడీ అయ్యింది. శుక్రవారం చెన్నై వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకోనుంది.ముంబై చేతిలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఇక నుంచి ప్రతీ మ్యాచ్ గెలవాల్సిన పరిస్థితిని తెచ్చుకుంది. ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే ఇక నుంచి సన్‌రైజర్స్ ప్రతీ మ్యాచ్ గెలవాల్సిందే. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్ పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇరు జట్లు 8 మ్యాచ్‌లు ఆడి రెండేసి విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానాల్లో నిలిచాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు అట్టడుగు స్థానంలో నిలవనుంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఘోర పరాజయాలతో చతికల పడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్‌లపైనే జట్టు మొత్తం ఆధారపడి ఉంది. ఈ ఇద్దరూ ఆడితేనే విజయం లేదంటే ఓటమి అన్నట్లుగా తయారైంది ఆరెంజ్ ఆర్మీ పరిస్థితి. ఇషాన్ కిషన్, నితీష్ రెడ్డి ఘోర వైఫల్యం జట్టు విజయవకాశాలను దెబ్బతీస్తోంది. బౌలింగ్ విభాగంలో మహమ్మద్ షమీతో పాటు ఇతర బౌలర్లు తేలిపోతున్నారు. ముంబైతో మ్యాచ్‌కు స్టార్ పేసర్ మహమ్మద్ షమీని పక్కన పెట్టారు. రూ. 10 కోట్లు పెట్టి కొన్న ఆటగాడిని పక్కన పెట్టారంటేనే షమీ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. షమీ స్థానంలో బరిలోకి దిగిన జయదేవ్ ఉనాద్కత్ తేలిపోయాడు.చెన్నైలోని చెపాక్ మైదానం స్లో వికెట్. పేసర్లతో పాటు స్పిన్నర్లకు అనుకూలంగా ఉండనుంది. ఈ వికెట్‌పై పరుగులు చేసేందుకు బ్యాటర్లు ఇబ్బంది పడుతారు. ఈ క్రమంలోనే షమీని మళ్లీ తుది జట్టులోకి తీసుకోవచ్చు. అదే జరిగితే జయదేవ్ ఉనాద్కత్‌పై వేటు పడనుంది. మరోవైపు వరుస వైఫల్యాలతో ఇబ్బంది పడుతున్న ఇషాన్ కిషన్‌పై వేటు పడే అవకాశం ఉంది. అతని స్థానంలో అభినవ్ మనోహర్‌ను తీసుకొని.. ఎక్స్‌ట్రా స్పిన్నర్‌గా రాహుల్ చాహర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించవచ్చు.రూ. 11.25 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన ఇషాన్ కిషన్ దారుణంగా విఫలమవుతున్నాడు. తొలి మ్యాచ్ సెంచరీ మినహా అతను ఒక్క ఇన్నింగ్స్‌లో రాణించలేదు. ఎక్స్‌ట్రా బ్యాటర్ కావాలనుకుంటే మాత్రం ఇంపాక్ట్ ప్లేయర్‌గా స్మరన్ రవిచంద్రన్‌ను ఆడించే అవకాశం ఉంది.అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ ఓపెనర్లుగా ఆడనుండగా.. నితీష్ కుమార్ రెడ్డి, హెన్రీచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, అభినవ్ మనోహర్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. ప్యాట్ కమిన్స్, హర్షల్ పటేల్, మహమ్మద్ షమీ, జీషన్ అన్సారీ, ఇషాన్ మలింగా బౌలింగ్ బాధ్యతలు పంచుకోనున్నారు. టాపార్డర్ చెలరేగితేనే ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ విజయం సాధిస్తుంది. లేదంటే మరో పరాజయం తప్పదు. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే ఆరెంజ్ ఆర్మీ ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంటాయి.ముంబైతో పోరు.. సన్‌రైజర్స్ తుది జట్టు ఇదే:అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్/అభినవ్ మనోహర్, నితీష్ కుమార్ రెడ్డి, హెన్రీచ్ క్లాసెన్, అనికేత్ వర్మ, ప్యాట్ కమిన్స్, హర్షల్ పటేల్, మహమ్మద్ షమీ, జీషన్ అన్సారీ, ఇషాన్ మలింగా

# జట్టులోకి సంజూ శాంసన్ ?.. హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కీలక అప్‌డేట్

సంజూ శాంసన్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ జట్టు ఐపీఎల్ 2025లో దారుణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆ జట్టు చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల లాగే ఆరు మ్యాచ్‌లలో పరాజయాలను చవిచూసింది. ప్లేఆఫ్స్ అవకాశాలు చాలావరకు తగ్గిపోయాయి. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ అంతగా రాణించడం లేదు. రాజస్థాన్ కెప్టెన్ సంజు శాంసన్ కూడా ఈ సారి అంతగా ఆకట్టుకునే ప్రదర్శన చేయకపోవడం గమనార్హం. ఈ సీజన్‌లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా సంజు శాంసన్ మూడు మ్యాచ్‌లు ఆడాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ సందర్భంగా సంజూ శాంసన్ గాయపడ్డాడు. ఇంకా పూర్తి స్థాయిలో కోలుకోలేదు. గాయం కారణంగా సంజూ శాంసన్ చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. నేడు రాజస్థాన్ రాయల్స్ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడనుంది. ఈ క్రమంలో సంజూ శాంసన్ ఆరోగ్య పరిస్థితి గురించి రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కీలక అప్డేట్ ఇచ్చాడు.సంజూ శాంసన్ ఆరోగ్యంగా లేదని.. వైద్య బృందం తనకు ఆడటానికి అనుమతి ఇవ్వలేదని ఆయన అన్నారు. సంజూ శాంసన్ ఈ సీజన్‌లో ఏడు మ్యాచ్ లు ఆడాడు. సగటున 30 కన్నా ఎక్కువ పరుగులతో 140 స్ట్రైక్ రేట్‌తో 224 పరుగులు చేశాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో సంజూ శాంసన్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగినట్లు రాహుల్ ద్రవిడ్ మీడియా సమావేశంలో చెప్పాడు. సంజూ శాంసన్ లక్నోతో జరిగిన మ్యాచ్ లో ఆడలేకపోయాడని.. ఆర్సీబీతో జరిగే మ్యాచ్ లో ఆడడానికి వైద్యులు అతనికి అనుమతి ఇవ్వలేదని ద్రవిడ్ చెప్పుకొచ్చాడు.సంజూ శాంసన్ ఎందుకు ఆడడం లేదో కూడా ద్రవిడ్ వివరించాడు. వైద్యుల సలహా ప్రకారం వచ్చే మ్యాచ్‌లలో ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పాడు. ఫిజియోను కూడా సంజూ శాంసన్ తో ఉంచామని తద్వారా అతడినికి చికిత్స జరుగుతోందన్నారు. వీలైనంత త్వరగా సంజూ కోలుకునేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. సంజూ ఆరోగ్యాన్ని ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నామన్నారు. సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి ఎప్పుడు చేరతాడనేది చెప్పలేమని ద్రవిడ్ చెప్పుకొచ్చాడు. నేడు ఆర్సీబీతో రాజస్థాన్ జట్టు తలపడనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 28న గుజరాత్ టైటాన్స్ జట్టుతో మ్యాచ్ ఆడనుంది. మే 1న సవాయ్ మాన్సింగ్ స్టేడియంలో ముంబై ఇండియన్స్ తో జరిగే మ్యాచ్ ఆడనుంది.


# సబ్జా గింజలతో ఫుల్ ఆరోగ్యం.. ఒబేసిటీతో పాటు ఈ సమస్యలకు చెక్!



మనకు ఆరోగ్య ప్రయోజనాలను ఇచ్చే వాటిలో సబ్జా గింజలు ఒకటి. ఇక ఈ వేసవిలో సబ్జా గింజలు చేసే మేలు అంతా ఇంతా కాదు. వేసవి తాపానికి తల్లడిల్లుతున్న ప్రతిఒక్కరికి సబ్జా గింజలతో బోలెడన్ని ప్రయోజనాలు కలుగుతాయి. అధిక వేడితో ఇబ్బంది పడేవారు రోజుకు మూడు సార్లు నానబెట్టిన సబ్జా గింజల నీళ్ళు తాగడం వలన వేడి నుండి మీ శరీరం చల్లబడి మంచి ఉపశమనం పొందుతారు. అధిక బరువును తగ్గించడానికి సబ్జా గింజలు అధిక బరువుతో సతమతం అయ్యేవారు అనేక ఆనారోగ్య సమస్యలకు లోనవుతుంటారు. వారు సబ్జా గింజల నీళ్లను తాగడం వలన మంచి ప్రయోజనం ఉంటుంది. కేలరీలు తక్కువగా కలిగిన సబ్జా గింజలలో ,ఫైబర్ ఎక్కువగా ఉంటుంది, ఇది ఆకలిని తగ్గిస్తుంది, ఒంట్లో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ని తగ్గిస్తుంది. అధిక బరువు సమస్య సబ్జా గింజలను తీసుకుంటే పరిష్కారం అవుతుంది. గుండె సంబంధిత వ్యాధులను నయం చేస్తుంది గుండె సంబంధిత వ్యాధులున్న వారికి ఈ సబ్జా గింజలను నానబెట్టి తాగడం వలన గుండె జబ్బుల నుండి విముక్తి పొందుతారు. ఎందుకంటే సబ్జా గింజలలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉంటాయి ఇవి గుండె పనితీరును మెరుగుపరుస్తాయి.బీపీ తగ్గిస్తాయి. రక్త ప్రసరణకు దోహదపడతాయి. ఆర్థరైటిస్ సమస్యలు, శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉంటాయి. చర్మ సంబంధిత వ్యాధులకు సబ్జా గింజలు చర్మం పొడిబారకుండా మృదువుగా ఉండేందుకు సబ్జా గింజలు తోడ్పాడుతాయి , చర్మం పై నల్ల మచ్చలు ,మొటిమలు,గజ్జి , తామర వంటి చర్మ సంబంధిత వ్యాధులున్న వారికి సబ్జా గింజల నీళ్ళు తాగడం వలన త్వరితగతిన మార్పు వస్తుంది అని ఆయుర్వేద నిపుణులు చెప్తున్నారు. అరికాళ్ళు పగుళ్ళు ,లేదా అరికాళ్ళలో మంటలు కలిగే వారికి కూడా పగుళ్లను ,మంటలను నియంత్రించడంలో సబ్జా గింజలు పనిచేస్తాయి. సబ్జా గింజలను ఈ పద్ధతులో తగిన మోతాదులో తీసుకోండి శరీరంలో సమస్యలు ఉన్నాయి అని ఎలా బడితే అలా సబ్జా గింజలను ఉపయోగించటం మంచిది కాదు.సబ్జా గింజలను తీసుకోవాలనుకుంటే మినిమం ఒక ఎనిమిది గంటలకు ముందుగా సబ్జా గింజలను నీళ్లలో నానబెట్టి బాగా నాని ఉబ్బిన సబ్జా గింజలను ఒక గ్లాసు నీళ్లలో గాని లేదా చల్లారిన పాలల్లో గాని లేదా నిమ్మకాయ రసంతో కానీ కలిపి తాగితే మంచి ఫలితాలు ఉంటాయి.

# దేవునికి ఇష్టమైన ఈ పండు తింటే.. శరీరంలో సర్వ రోగాలు మాయం!

వేసవి కాలం వచ్చిందంటే చాలు, మార్కెట్లో రకరకాల పండ్లు దర్శనమిస్తాయి. మామిడి, పుచ్చకాయ, ద్రాక్ష, కర్బూజ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! వీటిలో కొన్ని మనకు బాగా తెలిసినవి, కొన్ని అంతగా తెలియనివి. అలాంటి వాటిలో ఒకటి వెలగపండు. దేవాలయాల్లో దేవుళ్లకు ఈ పండును నైవేద్యంగా సమర్పిస్తారు. ముఖ్యంగా వినాయకచవితి వచ్చిందంటే చాలు.. గణనాథుడికి సమర్పిస్తాం. విఘ్నేశ్వరుడికి ఇది ఎంతో ఇష్టమైన పండు. అలాగే, ఆయుర్వేదం ప్రకారం, ఈ పండులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. చూడటానికి బూడిద రంగులో గట్టిగా ఉండే ఈ పండు లోపల గుజ్జు మాత్రం తియ్యగా, పుల్లగా, వగరుగా కలిసిన రుచిని కలిగి ఉంటుంది. కొందరికి ఈ రుచి బాగా నచ్చుతుంది, కొందరికి అంతగా నచ్చకపోవచ్చు. కానీ రుచి ఎలా ఉన్నా, వెలగపండు ఆరోగ్యానికి మాత్రం ఎంతో మేలు చేస్తుంది. ఈ పండులో దాగున్న ప్రయోజనాలు తెలిస్తే, మీరు కూడా తప్పకుండా దీన్ని మీ ఆహారంలో చేర్చుకుంటారు. వెలగపండు – పోషకాల నిధి: వెలగపండు కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు, పోషకాల గని కూడా. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ సి, విటమిన్ బి కాంప్లెక్స్, పొటాషియం, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు ఇందులో సమృద్ధిగా లభిస్తాయి. ఈ పోషకాలన్నీ మన శరీరం ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో అవసరం. జీర్ణక్రియకు దివ్యౌషధం: వెలగపండు జీర్ణక్రియకు చాలా మంచిది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది, తద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు దూరమవుతాయి. విరేచనాలు, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలతో బాధపడేవారికి వెలగపండు మంచి ఉపశమనాన్ని ఇస్తుంది. వెలగపండును తరచూ తీసుకోవడం వల్ల మీ జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. శక్తిని పెంచే వెలగపండు: వెలగపండు తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఇందులో సహజ చక్కెరలు ఉంటాయి, ఇవి శరీరానికి త్వరగా శక్తిని అందిస్తాయి. నీరసంగా, అలసటగా అనిపించినప్పుడు వెలగపండు తినడం వల్ల వెంటనే శక్తి లభిస్తుంది. వ్యాయామం చేసే ముందు లేదా తర్వాత వెలగపండు తినడం వల్ల అలసటను తగ్గించుకోవచ్చు. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: వెలగపండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలోని తెల్ల రక్త కణాలను ఉత్తేజపరుస్తుంది, తద్వారా ఇన్ఫెక్షన్లు, వ్యాధుల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సాధారణ ఇన్ఫెక్షన్ల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికి వెలగపండు సహకరిస్తుంది. ం చర్మం– జుట్టు ఆరోగ్యానికి: వెలగపండు చర్మం , జుట్టు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి, తద్వారా చర్మం యవ్వనంగా, కాంతివంతంగా ఉంటుంది. మొటిమలు, మచ్చలు, ముడతలు వంటి చర్మ సమస్యలను తగ్గించడంలో వెలగపండు సహాయపడుతుంది. అలాగే, వెలగపండు జుట్టును బలంగా, ఆరోగ్యంగా ఉంచడానికి కూడా తోడ్పడుతుంది. జుట్టు రాలడాన్ని తగ్గించి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణ: వెలగపండు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడే కొన్ని సమ్మేళనాలను కలిగి ఉంటుంది. మధుమేహంతో బాధపడుతున్నవారు వెలగపండును తీసుకోవడం వల్ల కొంతవరకు ప్రయోజనం పొందవచ్చు. అయితే, మధుమేహ రోగులు వెలగపండును తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.



: వెలగపండు కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరచడానికి, కాలేయ పనితీరును మెరుగుపరచడానికి సహాయపడే కొన్ని సమ్మేళనాలను కలిగి ఉంటుంది. కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు వెలగపండును తీసుకోవడం వల్ల కొంతవరకు ఉపశమనం పొందవచ్చు. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: వెలగపండు రక్తపోటును తగ్గించడంలో , కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది, తద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీనిలోని యాంటీ క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయి, ఇవి క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయి. వెలగపండులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి, ఇవి శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దీనిలోని పొటాషియం, కాల్షియం, ఇనుము వంటి ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరంలోని వివిధ విధులకు అవసరమైన పోషకాలను అందిస్తాయి.? వెలగపండును ఎలా తీసుకోవాలి? వెలగపండును అనేక విధాలుగా తీసుకోవచ్చు. ఈ పండును పగలగొట్టి గుజ్జును నేరుగా తినవచ్చు. దీని రుచి కొంచెం పుల్లగా, తియ్యగా ఉంటుంది . అంతే కాకుండా ఈ పండు గుజ్జును నీటిలో కలిపి జ్యూస్ లాగా తయారుచేసుకొని తాగవచ్చు. ఇది వేసవిలో శరీరాన్ని చల్లబరుస్తుంది. వెలగపండుతో పచ్చడి కూడా చేసుకోవచ్చు. ఇది అన్నం, చపాతీ, ఇడ్లీ వంటి వాటితో చాలా రుచిగా ఉంటుంది . ఈ పండు గుజ్జును పెరుగులో కలిపి రైతా తయారుచేసుకోవచ్చు. ఇది వేసవిలో చల్లగా, రుచిగా ఉంటుంది. వెలగపండు రుచి కొంచెం విభిన్నంగా ఉండవచ్చు, కానీ దాని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అమోఘం. ఈ వేసవిలో వెలగపండును తప్పకుండా మీ ఆహారంలో చేర్చుకోండి , దాని ఆరోగ్య ప్రయోజనాలను పొందండి.

# చింతపండును నెల రోజులు పక్కన పెడితే .. శరీరంలో కలిగే అద్భుత మార్పులు ఇవే!




మన తెలుగు వంటకాలలో చింతపండుది ఓ ప్రత్యేక స్థానం. పులుసు, పచ్చడి, పులిహోర, సాంబార్... ఇలా చెప్పుకుంటూ పోతే చింతపండు లేని వంటగదిని ఊహించుకోవడం కష్టమే. ఆ పుల్లపుల్లని రుచి మన నాలుకకు ఎంతగానో నచ్చుతుంది. మరి అలాంటి చింతపండును ఒక్క నెల రోజులు పూర్తిగా పక్కన పెడితే మన శరీరంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయి? ఇది మంచిదా, కాదా? తెలుసుకోవాలనే ఆసక్తి మీకు కూడా ఉందా? అయితే చదివేయండి. చింతపండును నెల రోజుల పాటు తినడం మానేయడం వల్ల కొన్ని సానుకూల, మరికొన్ని గమనించదగ్గ మార్పులు శరీరంలో కనిపించే అవకాశం ఉంది. అవేంటో చూద్దాం: ” జీర్ణవ్యవస్థలో మార్పులు: ఎసిడిటీ తగ్గుదల: చాలా మందికి చింతపండు ఎక్కువగా తింటే కడుపులో మంట, గ్యాస్, తేన్పులు వంటి సమస్యలు వస్తుంటాయి. ఇందులో ఉండే ఆమ్ల గుణాలే దీనికి కారణం. ఒక నెలపాటు చింతపండును పూర్తిగా మానేయడం వల్ల, ముఖ్యంగా ఎసిడిటీ సమస్యతో బాధపడేవారికి, ఈ సమస్యల నుంచి గణనీయమైన ఉపశమనం లభించవచ్చు. కడుపు ఉబ్బరం కూడా తగ్గే అవకాశం ఉంది. మలబద్ధకంపై ప్రభావం: చింతపండులో ఉండే సహజ గుణాలు కొంతవరకు మలబద్ధకాన్ని నివారించడానికి సహాయపడతాయి. దీన్ని పూర్తిగా మానేయడం వల్ల కొందరిలో జీర్ణక్రియ వేగం కొద్దిగా తగ్గి, మలబద్ధకం సమస్య తలెత్తే అవకాశం లేకపోలేదు. అయితే, ఇది వ్యక్తిగత జీర్ణశక్తిపై ఆధారపడి ఉంటుంది. పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఇతర ఆహారాలను తీసుకోవడం ద్వారా దీన్ని అధిగమించవచ్చు. 5 5 00:00 / 01:59 రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం: చింతపండును తరచుగా బెల్లం లేదా చక్కెరతో కలిపి వంటకాల్లో వాడతాం (ఉదా: పానకం, కొన్ని పచ్చళ్ళు). ఇలా చక్కెరతో కలిపి తీసుకున్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. చింతపండుతో పాటు ఈ చక్కెరలను కూడా మానేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలపై కొంత సానుకూల ప్రభావం చూపవచ్చు, ముఖ్యంగా మధుమేహం నియంత్రణలో ఉన్నవారికి ఇది మేలు చేయవచ్చు. అయితే, కేవలం చింతపండు మానేయడం వల్ల మాత్రమే భారీ మార్పులు వస్తాయని చెప్పలేం. దంత ఆరోగ్యం మెరుగుపడే అవకాశం: చింతపండులోని ఆమ్ల గుణం (టార్టారిక్ యాసిడ్) దంతాలపై ఉండే ఎనామిల్‌ను కొద్దిగా దెబ్బతీసే అవకాశం ఉంది. తరచుగా, ఎక్కువగా చింతపండు తినేవారిలో దంతాల సున్నితత్వం పెరగవచ్చు. నెల రోజుల పాటు దీన్ని మానేయడం వల్ల దంతాలపై ఈ ఆమ్ల దాడి తగ్గి, దంత ఆరోగ్యం కొంత మెరుగుపడే ఆస్కారం ఉంది. రుచిలో మార్పు: ప్రతిరోజూ చింతపండు రుచికి అలవాటు పడిన నాలుక, దాన్ని మానేయగానే ఆ పుల్లని రుచిని కోరుకోవచ్చు. ఇతర పుల్లని పదార్థాల వైపు మనసు మళ్లే అవకాశం ఉంది. కొంతకాలం తర్వాత, రుచి మొగ్గలు ఈ మార్పుకు అలవాటు పడవచ్చు. శరీరంలో నీటి శాతం: చింతపండులో పొటాషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటంలో సహాయపడతాయి. అయితే, సాధారణంగా మనం తీసుకునే చింతపండు పరిమాణం తక్కువే కాబట్టి, దీన్ని మానేయడం వల్ల శరీరంలోని నీటి శాతంలో పెద్దగా తేడాలు రాకపోవచ్చు. అయితే ఈ మార్పులన్నీ అందరిలోనూ ఒకేలా ఉండవని గుర్తుంచుకోవాలి. మీ జీవనశైలి, ఇతర ఆహారపు అలవాట్లు, ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఫలితాలు మారవచ్చు. చింతపండు పూర్తిగా అనారోగ్యకరమైనది కాదు. మితంగా తీసుకుంటే దానిలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటి ప్రయోజనాలు కూడా ఉన్నాయి. నెల రోజుల పాటు చింతపండు మానేయాలనుకుంటే, మీ ఆహారంలో ఇతర పోషకభరితమైన పదార్థాలు ఉండేలా చూసుకోవడం ముఖ్యం. ఏదైనా ఆహార మార్పులు చేసే ముందు, ముఖ్యంగా మీకు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే, వైద్యుడిని లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించడం అత్యంత శ్రేయస్కరం. ఒక నెల చింతపండు మానేయడం వల్ల కలిగే ప్రభావాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయి. ముఖ్యంగా ఎసిడిటీ సమస్యలు ఉన్నవారికి ఇది కొంత ఉపశమనాన్ని ఇవ్వొచ్చు. అయితే, చింతపండు మన సంప్రదాయ ఆహారంలో ఒక భాగం. దాన్ని పూర్తిగా దూరం పెట్టాలా వద్దా అనేది వ్యక్తిగత నిర్ణయం మరియు ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. మీ శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం ఒక ఆసక్తికరమైన ప్రయోగం కావచ్చు, కానీ సమతుల్య ఆహారం, మితమైన వినియోగం ఎల్లప్పుడూ ఆరోగ్యానికి కీలకం అని మర్చిపోకూడదు.

# ఆల్కహాల్‌లో కూల్ డ్రింక్ కలిపి తాగితే గుండె ఆరోగ్యానికి హానికరమా?

పార్టీలైనా, స్నేహితులతో సరదాగా గడిపే సమయమైనా చాలామందికి ఆల్కహాల్ తో పాటు కూల్ డ్రింక్ లేదా సోడా కలుపుకుని తాగడం ఒక అలవాటు. ముఖ్యంగా మద్యం ఘాటైన రుచిని ఇష్టపడని వారు, కొత్తగా తాగడం మొదలుపెట్టిన వారు ఇలా చేస్తుంటారు. కూల్ డ్రింక్ తీపిదనం, రకరకాల ఫ్లేవర్లు మద్యం రుచిని తెలియకుండా చేస్తాయి, తాగడాన్ని సులభతరం చేస్తాయి. కానీ, ఈ కాంబినేషన్ మీ ఆరోగ్యానికి ఎంత హానికరం అనేది ఎప్పుడైనా ఆలోచించారా? కేవలం రుచి కోసం చేసే ఈ పని, తెలియకుండానే అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకు హానికరం? మద్యం మోతాదు తెలియకపోవడం: ఆల్కహాల్‌లో కూల్ డ్రింక్ కలపడం వల్ల అనేక రకాలుగా ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుంది.వాటిల్లోని తీపి, కార్బొనేషన్ (గ్యాస్), ఫ్లేవర్ల వల్ల ఆల్కహాల్ యొక్క అసలైన రుచిని, ఘాటును మార్చేస్తాయి. దీనివల్ల మీరు ఎంత మోతాదులో మద్యం సేవిస్తున్నారో సరిగ్గా అంచనా వేయలేరు. ఫలితంగా, తెలియకుండానే ఎక్కువ మద్యం తాగేస్తారు. ఇది త్వరగా మత్తు ఎక్కువ అవ్వడానికి, కొన్నిసార్లు ఆల్కహాల్ పాయిజనింగ్ కు దారితీసే ప్రమాదం ఉంది. వేగంగా రక్తంలో కలవడం: చాలా కూల్ డ్రింక్స్ లో కార్బొనేషన్ (గ్యాస్ బుడగలు) ఉంటుంది. ఈ కార్బొనేషన్, కడుపు నుండి ఆల్కహాల్‌ను చిన్న ప్రేగులలోకి వేగంగా పంపిస్తుంది. చిన్న ప్రేగులలో ఆల్కహాల్ శోషణ చాలా వేగంగా జరుగుతుంది. దీనివల్ల ఆల్కహాల్ చాలా త్వరగా రక్తంలో కలిసి, మీరు అనుకున్నదానికంటే వేగంగా, తీవ్రంగా మత్తులోకి జారుకుంటారు. ఇది ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీయవచ్చు. అధిక చక్కెర మోతాదు: సాధారణ కూల్ డ్రింక్స్‌లో చక్కెర శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఆల్కహాల్‌లో ఇప్పటికే కేలరీలు ఉంటాయి. దీనికి తోడు కూల్ డ్రింక్‌లోని అధిక చక్కెర కలవడం వల్ల శరీరంలోకి అనవసరమైన కేలరీలు భారీగా చేరతాయి. ఇది దీర్ఘకాలంలో బరువు పెరగడానికి, ఊబకాయానికి, టైప్–2 డయాబెటిస్ (మధుమేహం) వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. ’ డీహైడ్రేషన్ : ఆల్కహాల్ మూత్రవిసర్జనను పెంచి డీహైడ్రేషన్‌కు కారణమవుతుంది. అలాగే, చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలు, కెఫిన్ ఉన్న కూల్ డ్రింక్స్, కూడా డీహైడ్రేషన్‌ను పెంచుతాయి. ఈ రెండూ కలిపి తాగినప్పుడు డీహైడ్రేషన్ సమస్య మరింత తీవ్రమవుతుంది. దీనివల్ల మరుసటి రోజు వచ్చే హ్యాంగోవర్ లక్షణాలు (తలనొప్పి, నీరసం) మరింత తీవ్రంగా ఉంటాయి. దీర్ఘకాలంలో కిడ్నీలపై కూడా భారం పడుతుంది. కెఫిన్ – ఆల్కహాల్ విరుద్ధ ప్రభావాలు: కొన్ని కూల్ డ్రింక్స్ కెఫిన్‌ను కలిగి ఉంటాయి. కెఫిన్ ఒక ఉత్తేజపరిచే పదార్థం, ఆల్కహాల్ ఒక నిషామయమైన పదార్థం. ఈ రెండింటినీ కలపడం వల్ల శరీరానికి తప్పుడు సంకేతాలు అందుతాయి. కెఫిన్ మిమ్మల్ని తాత్కాలికంగా చురుకుగా ఉంచడం వల్ల, మీరు ఎంత మత్తులో ఉన్నారో సరిగ్గా గ్రహించలేరు. ఇది మిమ్మల్ని మరింత మద్యం తాగేలా లేదా రిస్కీ ప్రవర్తనలకు పాల్పడేలా



ప్రేరేపిస్తుంది. గుండెపై కూడా ఇది అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. డైట్ కూల్ డ్రింక్స్ కూడా సురక్షితం కాదు: చక్కెర లేని డైట్ కూల్ డ్రింక్స్ కలుపుకుంటే ఫరవాలేదు అనుకుంటే పొరపాటే. కొన్ని అధ్యయనాల ప్రకారం, డైట్ డ్రింక్స్‌లోని కృత్రిమ తీపి పదార్థాలు కూడా ఆల్కహాల్ శోషణను వేగవంతం చేయవచ్చని తెలుస్తోంది. కాబట్టి, చక్కెర లేకపోయినా, వేగంగా మత్తు ఎక్కే ప్రమాదం వీటితోనూ ఉంది. మద్యంలో కూల్ డ్రింక్ కలపడం రుచిగా అనిపించవచ్చు, కానీ ఆరోగ్యానికి ఖచ్చితంగా మంచిది కాదు. ఇది తెలియకుండానే ఎక్కువ మద్యం తాగేలా చేయడం, ఆల్కహాల్‌ను వేగంగా రక్తంలో కలిసేలా చేయడం, శరీరంలో చక్కెర శాతాన్ని పెంచడం, డీహైడ్రేషన్‌కు గురిచేయడం వంటి అనేక సమస్యలకు కారణమవుతుంది. దీర్ఘకాలంలో ఊబకాయం, మధుమేహం, కాలేయ సమస్యలు, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మద్యం సేవించాల్సి వస్తే, దానిని నీటితో లేదా తక్కువ పరిమాణంలో సోడాతో (చక్కెర లేనిది) కలుపుకోవడం కొంతవరకు మేలు. అయితే, అన్నింటికంటే ముఖ్యమైనది మితంగా సేవించడం లేదా పూర్తిగా దూరంగా ఉండటం. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంది, బాధ్యతాయుతంగా వ్యవహరించండి!




# అందుకే ఆ రోజు అలా మాట్లాడా..

లేడీ సూపర్ స్టార్ గా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన విజయశాంతి కెరీర్లో ఎన్నో మంచి మంచి సినిమాలొచ్చాయి. ఆమె నటన, టాలెంటే ఆమెను సాధారణ హీరోయిన్ నుంచి లేడీ సూపర్ స్టార్ ను చేశాయి. రీసెంట్ గా అర్జున్ సన్నాఫ్ వైజయంతీ సినిమాలో నటించి, కర్తవ్యం సినిమాలోని వైజయంతిని గుర్తు చేసిన విజయశాంతి ఆ సినిమాలో తన నటనతో మంచి మార్కులు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పలు విషయాలను తెలిపారు. తాను ఎలాంటి నటి, ఎలాంటి సినిమాలు చేశాననే విషయం గత తరానికి తెలుసని, ఈ తరానికి కూడా తన టాలెంట్ తెలియాలనే ఆలోచనతోనే అర్జున్ సన్నాఫ్ వైజయంతీ సినిమా చేశానని చెప్తున్న విజయశాంతి, ఈ కథలో తల్లీ కొడుకుల మధ్య ఉండే ఎమోషన్ తో పాటూ యాక్షన్ కూడా తనను ఎట్రాక్ట్ చేసిందని, ఈ ఏజ్ లో తనకు యాక్షన్ ఎంతో పెద్ద సవాల్ అని, అయినప్పటికీ దాన్ని ఛాలెంజ్ గా తీసుకుని చేశానని, సినిమా రిలీజయ్యాక అందరి నుంచి ఈ విషయంలో ప్రశంసలొస్తుంటే ఆనందంగా ఉందని విజయశాంతి తెలిపారు. రాములమ్మను ఎలాంటి క్యారెక్టర్ లో చూడాలనుకున్నామో అలాంటి పాత్రలోనే చూశామని అందరూ అంటున్నారని, కళ్యాణ్ రామ్ కూడా ఎంతో బాగా నటించాడని, స్క్రీన్ పైనే కాకుండా ఆఫ్ స్క్రీన్ లో కూడా తమ బంధం అలానే ఉంటుందని, కళ్యాణ్ రామ్ తనపై చూపించే ప్రేమ, ఆప్యాయత చూస్తుంటే, గత జన్మలో తను నా బిడ్డేమో అనిపిస్తుందని.. తల్లి, కొడుకుల గురించి కళ్యాణ్ రామ్ అలా మాట్లాడుతుంటే చాలా గర్వంగా అనిపించిందని విజయశాంతి అన్నారు.కొన్నాళ్లుగా ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాల్ని చూస్తున్నాకాబట్టి సినిమాను చంపేయొద్దని మాట్లాడానని, ఇండస్ట్రీపై ఆధారపడి ఎంతోమంది బతుకుతున్నారని అందుకే కనీస బాధ్యత వ్యవహరించాలని చెప్పానన్నారు. ప్రతీ ఒక్కరూ హీరోలతో సమానంగా హీరోయిన్లకు కూడా గౌరవం ఇవ్వాలని, సీనియర్ ఎన్టీఆర్ తనకంటే ఎంత చిన్నవాళ్లనైనా మీరు అనే గౌరవించేవారని, ఆయన్ను చూసే అందరితో గౌరవంగా ఉండటం నేర్చుకున్నానని చెప్పిన ఆమె, హీరోయిన్లకు పెద్ద పాత్రలు ఇస్తే వాళ్లను వాళ్లు ప్రూవ్ చేసుకునే ఛాన్స్ ఉంటుందన్నారు.సుమారు 60 మంది హీరోలతో కలిసి పనిచేసిన తాను ఎన్నో ప్రయోగాలు చేశానని, ప్రతీ సినిమాలో హీరోలకు లుక్ మారినా తనకు మాత్రం అదే లుక్ ఉండేదని, ఆ లుక్ లోనే ఎప్పటికప్పుడు ఎన్నోరకాల ఎమోషన్స్ పలికించేదాన్నని, అందుకే ఆడియన్స్ తనను సింహాసనంపై కూర్చోపెట్టారని, పొలిటీషియన్ గా మీటింగ్స్ కు వెళ్లినప్పుడు మీలో ఉండే ధైర్యమే మాకు ఇన్సిపిరేషన్ అని చెప్పినప్పుడు చాలా సంతృప్తిగా ఉండేదని, ప్రేక్షకులకు కృష్ణుడు అనగానే ఎన్టీఆర్ ఎలా గుర్తొస్తారో, లేడీ పోలీసాఫీసర్ అనగానే విజయశాంతి గుర్తొస్తుందని, అందుకే ఇందులోని వైజయంతీ పాత్రను చేశానని విజయశాంతి చెప్పారు.






# ఎన్టీఆర్ బాడీ డబుల్ వార్ 2ను రిజెక్ట్ చేశాడా?

: తెరపై కనిపించే హీరోలకు డూప్‌లు అంటే బాడీ డబుల్ లు ఉంటారన్నది చాలా మందికి తెలిసినవిషయమే. తెరపై వీరోచిత విన్యాసాలు చేసే హీరోలని చూసి అభిమానులు,ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలకు లోనవుతూ ఉంటారు. సూపర్ హీరోల్లా అభిమాన హీరోలు చేసే సాహలోపేతమైన విన్యాసాలు, ఒళ్లుగగుర్పొడిచే స్టంట్‌లు మన హీరోలు చేయడం లేదంటే నమ్మడానికి కొంత కష్టంగానే ఉంటుంది కానీ క్లిష్టతమైన స్టంట్‌లు చేసేది మాత్రం హీరోలు కాదు వారి డూప్‌లు అంటే బాడీ డబుల్‌లు. ప్రతి హీరోకు బాడీ డబుల్ ఉన్నాడు. మెగాస్టార్ చిరంజీవి నుంచి క్రేజీ హీరోల వరకు బాడీ డబుల్స్ ఉన్నారు. ప్రతి సినిమాలోనూ, చివరికి కమర్షియల్ యాడ్సలలోనూ హీరోలు చేయలేని స్టంట్స్ చేస్తూ వారికి పేరు తెచ్చి పెడుతున్నారు. అందరి హీరోల్లాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్‌కు కూడా ఓ డూప్, ఓ బాడీ డబుల్ ఉన్నాడు. అతనే ఈశ్వర్ హరీస్. ఐటీ రంగంలో జాబ్‌ని వదులుకుని గత కొంత కాలంగా ఎన్టీఆర్‌కు బాడీ డబుల్‌గా పని చేస్తూ వస్తున్నాడు. ఎన్టీఆర్ కోసం వీరోచిత విన్యాసాల్లో కనిపించిన ఈశ్వర్ ఓ భారీ క్రేజీ ప్రాజెక్ట్‌ని రిజెక్ట్ చేశాడట. అదే బాలీవుడ్ మూవీ 'వార్ 2'. ఈ సినిమాతో ఎన్టీఆర్ బాలీవుడ్‌కు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. యష్‌రాజ్ ఫిలిమ్స్ స్పై యూనివర్స్ ఫ్రాంఛైజీల్లోని 'వార్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీలో హృతిక్ రోషన్ నటిస్తున్న విషయం తెలిసిందే. 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని ఎన్టీఆర్ బాడీ డబుల్ తిరస్కరించాడట. కారణం తను డిమాండ్ చేసిన మొత్తాన్ని ఇవ్వకపోవడమేనట. తను డిమాండ్ చేసిన పారితోషికంతో పాటు ముంబై ఫ్లైట్ ఛార్జీలు కూడా ఇవ్వనన్నారట. దీంతో హర్ట్ అయిన ఈశ్వర్ 'వార్ 2'ని తిరస్కరించాడట. మరి అతని స్థానంలో ఎన్టీఆర్ బాడీ డబుల్‌గా ఎవరిని తీసుకున్నారు? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే 'వార్ 2'ఆగస్టు 14న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. దీని తరువాత ఎన్టీఆర్ కోసం బాలీవుడ్ డైరెక్టర్స్, ప్రొడ్యూసర్స్ క్యూ కడతారని ఇన్ సైడ్ టాక్.

# ఎన్టీఆర్ తగ్గితే పుష్పరాజ్ మాత్రం తగ్గేదేలే!

'పుష్ప 2'తో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు దక్కిన పాపులారిటీ అంతా ఇంతా కాదు. దేశంలోని నలుమూలలకు బన్నీ క్రేజ్ పాకిన విషయం తెలిసిందే. స్టైల్‌కు ఐకాన్‌గా నిలిచిన అల్లు అర్జున్ ఈ సినిమాతో బాక్సాఫీస్ రికార్డుల్ని తిరగరాయడమే కాకుండా అత్యంత వివాదాలకు కేంద్ర బిందువుగా నిలవడం, జాతీయ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారడం తెలిసిందే. 'పుష్ప ది రూల్' పేరుకు తగ్గట్టే బాక్సాఫీస్‌ని రూల్ చేసిన బన్నీ ఈ సినిమాతో వరల్డ్ వైడ్‌గా రూ.1800 కోట్లు సాధించి ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.ఇంతటి సంచలన విజయం తరువాత అల్లు అర్జున్ సొందరపడకుండా 'పుష్ప2' లాంటి బ్లాస్టింగ్ హిట్ తరువాత అంతకు మించి అనే స్థాయి సినిమాతో ప్రేక్షకు ముందుకు రాబోతున్నాడు. 'పుష్ప 2' తరువాత బన్నీ తమిళ దర్శకుడు అట్లీ డైరెక్షన్‌లో పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే.అయితే ఈ సినిమా కోసం బన్నీ ఎక్కడా తగ్గడం లేదు. ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' కోసం ఎన్టీఆర్ దాదాపు 18 కేజీలు బరువు తగ్గడం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ ఏంటీ ఇలా తగ్గుతున్నాడు? .. ఎందుకింతగా తగ్గుతున్నాడు? ఎన్టీఆర్ బొద్దుగా ఉంటేనే మజా కానీ ప్రశాంత్ నీల్ అందుకు పూర్తి భిన్నంగా 'డ్రాగన్' కోసం ఎన్టీఆర్‌ని మరీ లీన్‌గా తయారు చేస్తున్నాడేంటీ? అనే కామెంట్‌లు వినిపించాయి. ఎన్టీఆర్‌ని చూసి ఫ్యాన్స్ షాక్‌కు గురయ్యారు కూడా. అయితే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం పుష్పరాజ్ మాత్రం తగ్గేదేలే అంటున్నాడు. అట్లీతో బన్నీ ఓ భారీ ప్రాజెక్ట్‌ని చేయబోతున్న విషయం తెలిసింద్ సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసం పలువురు హాలీవుడ్ టెక్నీషియన్‌లు పనిచేయబోతున్నారు. ఇదిలా ఉంటే ఈ ప్రాజెక్ట్‌లో బన్నీ సూపర్ హీరో తరహా క్యారెక్టర్‌లో కనిపించనున్నాడట. అయితే అందు కోసం బరువు తగ్గుతాడేమోనని అంతా అనుకుంటే అందుకు పూర్తి భిన్నంగా బన్నీ తగ్గేదేలే అన్నట్టుగా మునుపటికంటే ఫిట్‌గా మారిపోయారు. తాజాగా శంషాబాద్ ఏయిర్ పోర్ట్‌లో బన్నీ కనిపించిన తీరుకు అంతా అవాక్కవుతున్నారు. డెనిమ్ బ్లాక్ డ్రెస్‌లో బన్నీ మునుపటికంటే ఫిట్‌గా మరింత బొద్దుగా కనిపించడం విశేషం. ఫిజిక్ పెంచేసిన అల్లు అర్జున్ మరింత గ్లోతో కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఫ్యాషన్‌కి ఐకాన్‌గా భావించే బన్నీ బ్లాక్ డ్రెస్‌లో మరింత మ్యాన్లీగా కనిపించారు. ఇప్పటికే అట్లీ మూవీ లుక్ టెస్ట్ పూర్తి కావడంతో బన్నీ ఈ మూవీలో మరింత ఫిట్‌గా కనిపించి అదరగొట్టబోతున్నాడని అభిమానులు పండగ చేసుకుంటున్నారు.



# రెండేళ్ల క్రితం నా పుట్టిన రోజు అక్కడే జరిగింది : విజయ్ దేవరకొండ

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కుదిపేసింది. అమాయకులైన పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను, ఉగ్రవాద సంస్థలను క్షమించవద్దంటూ దేశం మొత్తం ముక్త కంఠంతో డిమాండ్ చేస్తుంది. సోషల్ మీడియాలో చాలా మంది దీనికి ప్రతీకారం తీసుకోవాల్సిందే అంటూ డిమాండ్ చేస్తున్నారు. సామాన్యులు మాత్రమే కాకుండా సెలబ్రెటీలు సైతం ఈ ఉగ్రదాడి ని తీవ్రంగా ఖండించి చనిపోయిన పర్యాటకులకు ప్రగాడ సంతాపం తెలియజేశారు. టాలీవుడ్‌కి చెందిన సినీ ప్రముఖులు పలువురు ఈ దారుణంపై స్పందించారు. సోషల్ మీడియా ద్వారా పలువురు తమ సంతాపం తెలియజేశారు. మెగాస్టార్ చిరంజీవి స్పందిస్తూ... 28 మంది చనిపోయిన ఈ ఘటన హృదయ విదారకమైనది. ఉగ్రవాదులు పాల్పడిన ఈ చర్య క్షమించరానిది. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అన్నారు. విజయ్ దేవరకొండ స్పందిస్తూ... రెండు సంవత్సరాల క్రితం పహల్గాంలో ఒక షూటింగ్‌లో పాల్గొన్నాను. ఆ సమయంలో షూటింగ్ చాలా సరదాగా నవ్వుల మధ్య సాగింది. ఆ సమయంలో మమ్మల్ని చాలా జాగ్రత్తగా స్థానిక కశ్మీరీలు చూసుకున్నారు. వారి ప్రేమ మధ్య ఆ సమయంలో నా పుట్టిన రోజు జరుపుకున్నాను. నిన్న జరిగిన హృదయ విదారక ఘటన నాకు కోపం తెప్పించింది. మిమ్మల్ని మీరు ఒక దళంగా చెప్పుకుంటూ పర్యాటకులను కాల్చి చంపడం అనేది కచ్చితంగా పిరికిపంద చర్య అంటూ ఉగ్రవాదుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కాశ్మీర్‌కు మేము అండగా నిలుస్తాము. ఈ పిరికి వాళ్ళు త్వరలోనే నిర్మూలించబడుతారు. భారతదేశం ఎప్పటికీ ఉగ్రవాదానికి తలవంచదు. అల్లు అర్జున్ స్పందిస్తూ... పహల్గాం ఎంతో అందమైన ప్రదేశం. అక్కడ జరిగిన ఘటన తెలిసి గుండె పగిలింది. బాధిత కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. ఎన్టీఆర్ స్పందిస్తూ... పహల్గాం ఘటనలో చనిపోయిన వారిని, బాధితులను చూస్తూ ఉంటే హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. అక్కడ శాంతి కోసం ప్రార్థిస్తున్నాను అన్నారు. నాని స్పందిస్తూ... మూడు నెలల క్రితం అక్కడ 200 మందితో కలిసి షూటింగ్‌లో పాల్గొన్నాను. ఇలాంటి దారుణాన్ని ఊహించలేదు. ఉగ్రదాడి హృదయాన్ని కలచి వేసింది అన్నారు. మహేష్ బాబు స్పందిస్తూ... ఇది డార్క్ డే, ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను. బాధిత కుటుంబాలకు అండగా ఉందాం అన్నారు. అక్షయ్ కుమార్ స్పందిస్తూ... ఈ దాడి దారుణమైనది. అమాయకులను చంపడం అనేది దారుణం. మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నాను. సంజయ్ దత్ స్పందిస్తూ... ఇది కచ్చితంగా క్షమించరాని ఘాతుకం. ఈ ఉగ్ర చర్యపై అందరూ మౌనం వీడాలి, తప్పకుండా ప్రతీకారం తీర్చుకోవాల్సిందే అని అన్నారు. జాన్వీ కపూర్ స్పందిస్తూ... పహల్గాం ఉగ్ర దాడి గురించి తెలిసి షాక్ అయ్యాను. సైనిక దుస్తుల్లో వచ్చి కాల్పులు జరపడం అనేది అన్యాయం. ఇలాంటి అనాగరిక చర్యల వల్ల నాలోని కోపాన్ని అణచివేయలేక పోతున్నాను. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల కోసం ప్రార్థన చేస్తున్నా. మేం మొత్తం మీ వెంట ఉన్నాం. ఈ సమయంలో ధైర్యంగా ఉండండి. సోనూసూద్ స్పందిస్తూ... అమాయకపై పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం దారుణం. ఇది కచ్చితంగా పిరికిపంద చర్య. నాగరిక ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు ఉండకూడదు.





Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**